APTEL 2009/31957

# నీలగిరి వార్త

మన కోసం మన వార్త తెలుగు దినపత్రిక
neelagirivartha@gmail.com



కవిత లేఖ వెనక కెసిఆర్ వ్యూహం 2 లో..



ప్రజా విప్లవంలో కొట్టుకుపోయిన నియంత 2 లో..

ఏపీ & తెలంగాణ | ఎడిటర్ : గుంటోజు విష్ణుమూర్తి | గురువారం | 05 - 06- 2025 | సంపుటి : 15 | సంచిక : 300 | పేజీలు : 12 | వెల : 5/- | అసోసియేట్ ఎడిటర్ : చెన్నూరి అన్వేషి



# ఇథనాల్ కంపనీ!

## కాంగ్రెస్ సర్కార్‌కు మరో సవాల్ విసిరిన ధన్వాడ

- ఇథనాల్ కంపెనీని వ్యతిరేకిస్తూ ఆందోళన
- కంపెనీ కార్లు, టెంట్లు దగ్ధం చేసిన రైతులు
- గద్వాల జిల్లా ధన్వాడలో తీవ్ర ఉద్రిక్తత

**జోగులాంబ గద్వాల- నీలగిరివార్త :**

ఇథనాల్ కంపెనీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ.. ప్రజలు ఆందోళనకు దిగడంతో గద్వాల జిల్లాలో ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. రాజోలు మండలం పెద్ద ధన్వాడ గ్రామంలో ఇథనాల్ కంపెనీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ పెద్ద సంఖ్యలో రైతులు ఆందోళన చేపట్టారు. గుట్టుచప్పుడు కాకుండా పనులు ప్రారంభించేందుకు కంపెనీ ప్రయత్నించడంతో మళ్లీ రైతులు ఆందోళన బాట పట్టారు. ఈ క్రమంలో పలు గ్రామాలకు చెందిన రైతులు ఫ్యాక్టరీ వ్యతిరేక ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలోనే ఫ్యాక్టరీ పనులను అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. గాయత్రి ఇథనాల్ కంపెనీకి చెందిన కార్లు, టెంట్లను రైతులు ధ్వంసం చేశారు. పరిశ్రమకు చెందిన టెంట్లు, కంటైనర్ డబ్బాలకు రైతులు నిప్పు పెట్టారు.కంపెనీ నిర్మాణ పనులు చేయిస్తున్న కూలీలను రైతులు తరిమికొట్టారు. ఆందోళన చేస్తున్న రైతులను అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. రైతులు ఆందోళన చేపట్టనున్నారన్న సమాచారం ముందస్తుగా పోలీసులు సంఘటనా స్థలం పోలీసులు మోహరించినా.. రైతులు భారీ సంఖ్యలో ఉండడంతో వారిని పోలీసులు నిలువరించలేకపోయారు. కంపెనీకి చెందిన స్థలంలో ఉన్న వాహనాలను సైతం రైతులు ధ్వంసం చేశారు. మూడు నెలల కిందట కంపెనీ ఉండదని చెప్పిన యాజమాన్యం.. మళ్లీ పనులు మొదలు పెట్టేందుకు ఉపక్రమించడంతో పది గ్రామాల రైతుల ఆందోళన చేపట్టారు. పెద్దధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ పనులను గుట్టుచప్పుడు కాకుండా కంపెనీ మళ్లీ ప్రారంభించింది. దాంతో మరోసారి రైతులు ఆందోళన చేపట్టారు. ఫ్యాక్టరీ వ్యతిరేక పోరుబాట పట్టడంతో మళ్లీ పెద్ద ధన్వాడ రణరంగంగా మారింది. కంపెనీ పనుల నేపథ్యంలో గ్రామ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పోరాట కమిటీ సైతం సూచించింది. ఈ క్రమంలో మంగళవారం కీలక ప్రకటన విడుదల చేసింది. అర్ధరాత్రి ప్రజలంతా నిద్రలో ఉండగా దొంగల్లాగా ఇథనాల్ ఫ్యాక్టరీ యాజమాన్యం కంటెనర్లు, టిప్పర్లు, హిటాచీలను ప్రైవేటు సైన్యంతో పెద్దధన్వాడలోని నిర్మాణ స్థలంలోకి తీసుకువచ్చినట్లు కమిటీ- పేర్కొంది. గత ఆరునెలలుగా 12 గ్రామాల ప్రజెనై క్యాన్సర్ కారకాలు, విషాన్ని చిమ్మే

మిగతా 2వ పేజీలో..

# కేసీఆర్‌కు నోటీసులా?

## యావత్ తెలంగాణకు ఇచ్చినట్లే!

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఫైర్
- నోటీసుల వెనుక రాజకీయ దురుద్దేశం ఉందని మండిపాటు
- కేసీఆర్ ఏం తప్పు చేశారని ప్రశ్నలవర్షం
- ఇందిరాపార్క్ వద్ద ధర్నాలో కవిత ప్రసంగం



**హైదరాబాద్- నీలగిరివార్త :**

రాజకీయ దురుద్దేశంతో కేసీఆర్‌కు నోటీసులు జారీ చేశారని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. కేసీఆర్ ఏం తప్పు చేశారని నోటీసులు ఇచ్చారని ప్రశ్నించారు. కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారంటే మొత్తం తెలంగాణకు నోటీసులు ఇచ్చినట్లేనని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేతృత్వంలో తెలంగాణ జాగృతి హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా నిర్వహించింది.ధర్నాలో కవిత పాల్గొని మాట్లాడారు. తెలంగాణ భూములకు నీళ్లు ఇవ్వడం కేసీఆర్ చేసిన తప్పా? తెలంగాణను అభివృద్ధిలో నెంబర్ వన్‌గా నిలబెట్టడం తప్పా? అంటూ మండిపడ్డారు. కాళేశ్వరం కమిషన్ కాదు.. అది కాంగ్రెస్ కమిషన్, రాజకీయ కమిషన్ కాళేశ్వరం

మిగతా 2వ పేజీలో..

# పాలన చేతగాని కాంగ్రెస్

- వేములవాడ కోడెల మృతి దారుణం
- ఎర్రగడ్డ ఆస్పత్రిలో ఫుడ్ పాయిజనింగ్
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

**సిద్దిపేట- నీలగిరివార్త :**

కాంగ్రెస్ పార్టీకి పాలన చేతగావడం లేదని ఎమ్మెల్యే హరీష్‌రావు తీవ్రంగా విమర్శించారు. వేములవాడలో కోడెల మృతి, ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనలపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలన చేయడం చేతకావడం లేదని వ్యాఖ్యానించారు. ఎర్రగడ్డ మానసిక రోగులకు తగిన ఆహారం కూడా అందడం లేదని 70 మంది అస్వస్థతకు గురయ్యారని, ఈ విషయంపై ఇప్పటివరకు సీఎం నుంచి ఎలాంటి స్పందన కనిపించలేదని మండిపడ్డారు. వేములవాడలో కోడెల మరణం కొనసాగుతుండగా



ప్రభుత్వం స్తంభించినట్లే ఉంది అని వ్యాఖ్యలు చేశారు. అనేక కోడెలు గడ్డి లేక చనిపోతున్నా, ప్రభుత్వం పట్టింపు తీసుకోవడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మాకు బాధ్యత అప్పగిస్తే

మిగతా 2వ పేజీలో..

# ఏజ్‌బార్ రిటైర్‌మెంట్!

## ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపు!?

- ఉద్యోగుల బకాయిల చెల్లింపుకు ఆమోదం!?
- పెండింగ్ బిల్లుల చెల్లింపుపై పైనా స్పష్టత!?
- తెలంగాణ ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక ఫోకస్!
- ఆర్థిక పరమైన అంశాలు హెల్త్ కార్డులపై నిర్ణయం
- ఉద్యోగులు, రైతాంగం ఆశలన్నీ సమావేశం పైనే!

**చెన్నూరి అన్వేషి - (ప్రత్యేక ప్రతినిధి నీలగిరివార్త) :**

తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. ఆర్థిక పరమైన అంశాలతో పాటుగా హెల్త్ కార్డుల పైన ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. గురువారం జరిగే మంత్రివర్గ సమావేశంలో డీఏ తో పాటుగా బకాయిల చెల్లింపు పైన నిర్ణయానికి ఆమో ద ముద్ర వేయనున్నారు. అదే విధంగా ఉద్యోగుల పదవీ విరమణ వయసు ఏడాది పాటు పెంచాల నే ప్రతిపాదన పైన చర్చ జరుగుతోంది. దీని పై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. పెండింగ్ బిల్లుల చెల్లింపు కు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

**ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక ఫోకస్!**

తెలంగాణలో ఉద్యోగుల సమస్యల పైన ప్రభుత్వం ప్రత్యేకంగా ఫోకస్ చేసింది. రేపు జరిగే మంత్రి వర్గ భేటీలో సమస్యల పరిష్కారానికి రోడ్‌మ్యాప్ ఖరారు చేయనున్నారు. ఇదే సమయంలో ఉద్యోగుల పదవీ విరమణ వయసు పైన చర్చ జరుగుతోంది. పదవీ విరమణ వయస్సును 61 నుంచి 62 ఏళ్లకు పెంచాలని భావిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. ఏడాదికి సుమారు రూ.9



వేలకోట్ల రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాల్సి ఉండటంతో ఈ ప్రతిపాదనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నిర్ణయం అమలుచేస్తే పదోన్నతులతో పాటుగా కొత్తగా ఉద్యోగ అవకాశాల పైన ప్రభావం పడుతుందనే వాదన ఉంది. దీంతో, ఈ ప్రతిపాదనపైన అన్ని కోణాల్లో చర్చించి ఆ తర్వాతనే తుది నిర్ణయం తీసుకుంటారని సమాచారం. ఇక, ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాల విషయం లోనూ ప్రభుత్వం చర్చలు చేస్తోంది.

**ఉద్యోగులు, యువత, రైతాంగం ఆశలన్నీ సమావేశం పైనే!**

గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిఅధ్యక్షతన సచివాలయంలో క్యాబినెట్ భేటీ జరగనుంది.దీంతో రాష్ట్రంలోని ఉద్యోగులు, యువత, రైతాంగం తమ ఆశలన్నీ మంత్రివర్గ సమావేశం పైనే పెట్టుకున్నారు. తాములేవనెత్తిన డిమాండ్లలోఆర్థిక,ఆ ర్థికేతర అంశాలపై క్యాబినెట్‌లో

మిగతా 2వ పేజీలో..

# విజయోత్సాహంలో విషాదం

- ఆర్‌సిబి విజయోత్సవ సభలో అపశృతి
- చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట
- ఘటనలో పదిమంది మృతి.. 50మందికి గాయాలు
- భారీగా తరలివచ్చిన అభిమానులతో స్టేడియం వద్ద తోపులాట
- కంట్రోల్ చేయలేక చేతులెత్తేసిన బెంగళూరు పోలీసులు
- బెంగుళూరు చేరుకున్న ఆర్‌సిబి జట్టుకు డిప్యూటి సిఎం స్వాగతం





**బెంగళూరు :**

బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం దగ్గర అపశ్రుతి చోటు చేసుకుంది. ఆర్‌సిబి విజయోత్సాహంలో విషాదం చోటుచేసుకుంది. క్రికెటర్ల విజయోత్సవాతన్ని కళ్లారాచూడాలని తరలివచ్చిన అభిమానుల తోపులాట తొక్కిసలాటకు దారితీసింది. ఈ క్రమంలో పదిమంది మృత్యువాతపడ్డారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 18 ఏళ్ల నిరీక్షణ తర్వాత కప్పు సాధించిన ఆనందంలో అభిమానులు భారీగా చిన్నస్వామి స్టేడియం వద్దకు చేరుకున్నారు. దీంతో అక్కడ భారీగా తొక్కిసలాట జరిగింది. చిన్నస్వామి స్టేడియం లోపలికి అభిమానులు తోసుకెళ్లేందుకు ప్రయత్నించారు. బారికేడ్లు దూకి స్టేడియంలోకి వెళ్లేందుకు అభిమానులు ప్రయత్నించారు. భారీ సంఖ్యలో వచ్చిన అభిమానులను పోలీసులు నియంత్రించలేకపోయారు. దీంతో అక్కడ తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో పది మంది మృతి చెందారు. మరో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. దాదాపు 50 మంది గాయాలపాలయ్యారు.వారిని వివిధ అస్పత్రులకు తరలించారు.అభిమానులను నియంత్రించేందు కు చిన్నస్వామి స్టేడియం దగ్గర పోలీసులు లాఠీఛార్జ్ ప్రారంభించారు. స్టేడియం ఖాళీ చేయాలని అభిమానులకు పోలీసులు విజ్ఞప్తి చేశారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవం సందర్భంగా పెను విషాదం చోటు చేసుకుంది. 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ ఆర్సీబీ ఐపీఎల్‌లో తొలి టైటిల్ సాధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ జట్టుకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో స్టేడియం వద్దకు వేలాదిగా అభిమానులు తరలివచ్చారు. స్టేడియం గేట్లు, సమీపంలోని గోడలు, చెట్లు ఎక్కారు. గేట్-2 నుంచి స్టేడియంలోకి వెళ్లేందుకు ఒక్కసారిగా దూసుకెళ్లారు. అభిమానులను అదుపు చేసేందుకు పోలీసులు లాఠీ ఛార్జి చేయాల్సి వచ్చింది. దీంతో ఒక్కసారిగా

మిగతా 2వ పేజీలో..



# ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

- జూన్ రెండో వారానికి పంపిణీ పూర్తి
- ఇంటర్ బోర్డు ప్రకటన

**హైదరాబాద్ :**

విద్యార్థులకు పుస్తకాల పంపిణీపై ఇంటర్‌బోర్డు కీలక ప్రకటన చేసింది. ప్రభుత్వ జూని యర్ కళాశాలలలో చదువుతున్న విద్యార్థులకు 2025–26 విద్యా సంవత్సరానికి పాఠ్య పుస్తకాల ముద్రణ, పంపిణీ కార్యక్రమం ప్రారంభం అయిందని తెలిపింది.మొదటి సంవత్సర విద్యార్థులకు తెలుగు అకాడమీ ద్వారా పాఠ్య పుస్తకాల ముద్రణ పూర్తయిందని వెల్లడించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు పుస్తకాల పంపిణీ ఇప్పటికే ప్రారంభం కాగా, జూన్ మొదటి వారంలో పంపిణీ

మిగతా 2వ పేజీలో..



ట్రావెల్స్ బ్యాగులో మహిళ మృతదేహం 2 లో..

# 2027 మార్చి 1 నుంచి జనాభా లెక్కలు

- అప్పుడే కులగణన కూడా జరిగే అవకాశం
- కేంద్ర అధికార వర్గాల వెల్లడి

**న్యూఢిల్లీ - నీలగిరివార్త :**

దేశవ్యాప్త జనగణన ఎప్పుడు నిర్వహిస్తారోనన్న ఎదురు చూపులకు తెరపడనుంది. జనగణనపై కేంద్రం స్పష్టత ఇచ్చింది. ఈ మేరకు కేంద్రం సన్నద్ధమవుతోంది. 2027 మార్చి 1 నుంచి జనాభా లెక్కింపు జరగనుందని కేంద్ర అధికార వర్గాలు వెల్లడించాయి. దీంతో పాటు కులగణన కూడా నిర్వహించనున్నట్లు తెలిపాయి. హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్, ఉత్తరఖండ్, లద్దాఖ్‌లతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాల్లో మాత్రం 2026 అక్టోబర్ ప్రారంభంలోనే లెక్కింపు మొదలుపెట్టే అవకాశం ఉందని పేర్కొన్నాయి. ఈ జనాభా గణన రెండు దశల్లో నిర్వహించనున్నారు. మహిళలు, పురుషుల లెక్కింపుతో పాటు కులం, ఉపకులాలను లెక్కించి జాబితా రూపొందించనున్నారు. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలోని 'రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా' పర్యవేక్షణలో జనాభా లెక్కలు నిర్వహిస్తారు. సాధారణంగా పదేళ్లకోసారి జనాభా లెక్కలు నిర్వహిస్తారు. చివరి సారి 2011లో దీన్ని నిర్వహించారు. 2021 జనాభా లెక్కలకు సంబంధించి 2020లోనే ఈ ప్రక్రియ చేపట్టాల్సింది. కానీ కొవిడ్ కారణంగా వాయిదా పడింది. ఎప్పుడు నిర్వహిస్తారనేదాని



మిగతా 2వ పేజీలో..



టెట్ పరీక్షల షెడ్యూల్ విడుదల

18 నుంచి 30 వరకు ఎగ్జామ్స్ 2 లో..

# టెట్ 2025 పరీక్షల షెడ్యూల్ విడుదల

**18 నుంచి 30 వరకు ఎగ్జామ్స్**

**హైదరాబాద్ :** ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ 2025 పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. జూన్ 18 నుంచి 30 వరకు ఎగ్జామ్స్ జరగనున్నాయి. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సిబీటీ) పద్ధతిలో ఈ పరీక్షలను నిర్వహిస్తారు. రోజూ రెండు సెషన్లలో ఉ.9 గంటల నుంచి 11:30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4:30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. జూన్ 9 నుంచి హాల్ టికెట్లు-డౌన్‌లోడ్ చేసుకోవచ్చని విద్యాశాఖ తెలిపింది. ఈసారి టెట్‌కు 1,83,653 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పూర్తి ఎగ్జామ్ షెడ్యూల్ కోసం టెట్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

# మాజీ ఎమ్మెల్సీ రంగారెడ్డి మృతి

**హైదరాబాద్ :** మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డి కన్నుమూశారు. గుండెపోటుతో బుధవారం తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం శామీర్‌పేటలో రంగారెడ్డి అంత్యక్రియ నిర్వహించనున్నారు. మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డికి ఆయన సన్నిహితులుగా ఉండేవారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక సారి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. రంగారెడ్డి మృతిపట్ల వివిధ పార్టీల నేతలు సంతాపం తెలిపారు.


# ట్రావెల్స్ బ్యాగులో మహిళ మృతదేహం

**హత్యచేసి పడేసినట్లు పోలీసుల గుర్తింపు**

**మేడ్చల్ :** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బాచుపల్లి పియస్ పరిధిలో దారుణం చోటు- చేసుకుంది. విజయదుర్గ ఓనర్స్ అసోసియేషన్ కాలనీ నిర్మానుష్య ప్రాంతంలో బ్యాగులో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది.. బ్యాగ్ నుంచి దుర్వాసన వస్తుందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతురాలు వయసు 25 నుంచి 35 సంవత్సరాలు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. మెరూన్ కలర్ పంజాబీ డ్రెస్ తో ఉన్నట్లుగా పోలీసులు తెలిపారు. మృత దేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాలానగర్ జోన్ డీసీపీ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీంలు రంగంలోకి దిగాయి. మృతురాలి ఆచూకీ, హత్య చేసిన వారి వివరాల కోసం దర్యాప్తు చేపడుతున్నారు.

# ప్రజా విప్లవంలో కొట్టుకుపోయిన నియంత

**ఏడాది పాలనపై చంద్రబాబు ట్వీట్**



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో చరిత్ర సృష్టించిన రోజు అని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ప్రజా విప్లవానికి నియంత పాలకులు కొట్టుకుపోయిన రోజు అని, అధికారం పేరుతో ఊరేగిన ఉన్మాదాన్ని ప్రజలు తరిమికొట్టిన రోజన్నారు. ప్రభుత్వ ఉగ్రవాదంతో గాయపడ్డ రాష్ట్రాన్ని కూటమి చేతిలో పెట్టి సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు నాంది పలికిన రోజని అన్నారు. పసుపు సైనికుల పోరాటాలు, జనసైనికుల ఉద్యమాలు, కమలనాథుల మద్దతుతో రాష్ట్రం గెలిచిన రోజు అని సీఎం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి నేటితో సరిగ్గా ఏడాది గడించింది. ఈ సందర్భంగా సీఎం ఎక్స్‌లో పోస్టు పెట్టారు. జూన్ 4.. ప్రజా తీర్పు దినం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో చరిత్ర సృష్టించిన రోజు. ప్రజా విప్లవానికి నియంత పాలకులు కొట్టు-కుపోయిన రోజు. అధికారం పేరుతో ఊరేగిన ఉన్మాదాన్ని ప్రజలు తరిమికొట్టిన రోజు. సైకో పాలనకు అంతం పలికి.. ప్రతి పౌరుడూ స్వేచ్ఛ, ప్రశాంతత పొందిన రోజు. ఉద్యమంలా ఓట్లేసి తిరిగి రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టిన రోజు. ప్రభుత్వ ఉగ్రవాదంతో గాయపడ్డ రాష్ట్రాన్ని కూటమి చేతిలో పెట్టి సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు నాంది పలికిన రోజు. పసుపు సైనికుల పోరాటాలు, జనసైనికుల ఉద్యమాలు, కమలనాథుల మద్దతుతో రాష్ట్రం గెలిచిన రోజు' అని ఏపీ సీఎం చంద్రబాబు ఎక్స్‌లో పోస్టు చేశారు. ఏడాది క్రితం ప్రజలు ఇచ్చిన అధికారాన్ని రాష్ట్ర పునర్నిర్మాణ బాధ్యతగా భావించి ప్రతి రోజూ పనిచేస్తున్నాం. ప్రజల ఆశలు, ఆకాంక్షల నెరవేర్చేందుకు ప్రజలు పెట్టు-కున్న నమ్మకాన్ని నిజం చేసేందుకు పాలనను గాడిన పెట్టి.. సంక్షేమాన్ని అందిస్తూ, అభివృద్ధి పట్టాలెక్కించాం. రాష్ట్ర దశ దిశను మార్చేందుకు ఇచ్చిన ఏకపక్ష తీర్పుకు ఏడాది పూర్తయిన సందర్భంగా నాటి విజయాన్ని గుర్తుచేసుకుంటూ ప్రజలకు శిరసు వంచి నమస్కారాలు తెలియజేస్తున్నాను. వచ్చే 4 ఏళ్లలో మరెన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని మాట ఇస్తున్నాము. విధ్వంస పాలకులపై రాజీలేని పోరాటంతో కూటమి విజయానికి నాంది పలికిన తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీల కార్యకర్తలకు, నాయకులకు అభినందనలు, ధన్యవాదాలు. జై ఆంధ్రప్రదేశ్.. జై జై ఆంధ్రప్రదేశ్' అని సీఎం రాసుకొచ్చారు.

# విద్యుత్ శాఖ అధికారి అమానవీయ ప్రవర్తన


**చర్యలు తీసుకోవాలంటూ సిఎంకు రాజాసింగ్ లేఖ**



**హైదరాబాద్ :** గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాద బాధితుల పట్ల విద్యుత్ శాఖ అధికారి అమానవీయ ప్రవర్తనపై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. సంబంధిత అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని అభ్యర్థిస్తూ సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. చార్మినార్‌లోని గుల్జార్ హౌస్‌లో జరిగిన వినాశకరమైన అగ్నిప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 17 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ సంఘటన మన నగరాన్ని కలచివేసింది. మృతుల కుటుంబానికి ఊహించలేని దుఃఖాన్ని కలిగించింది. బాధితులకు సాధ్యమైనంత మద్దతు అందించాల్సిన సమయంలో విద్యుత్ శాఖకు చెందిన ఓ అధికారి వారిపట్ల అసభ్యకరంగా, అనైతికంగా వ్యవహరించాడు. ఇప్పటికే పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబం నుంచి 2.5 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశాడు. అంతే కాకుండా.. ఇంట్లోని ఓ మహిళా సభ్యురాలి పట్ల అభ్యంతరకరమైన భాషను కూడా ఉపయోగించారు. ఆ అధికారి ఆమె ఫోన్‌ను లాక్కొని బెదిరింపులకు దిగాడు. ఇప్పటికే బాధలో ఉన్న కుటుంబాన్ని మరింత ఇబ్బంది పెట్టడం దారుణం.. ఇటువంటి ప్రవర్తన ఆమోదయోగ్యం కాదు. ఇది ప్రజా సేవా నైతికతను ఉల్లంఘించడం. ఇలాంటి ఘటనలు ప్రభుత్వ యంత్రాంగానికి చెడ్డపేరు తెస్తాయి. ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. ఈ నేపథ్యంలో పూర్తి దర్యాప్తు జరిగే వరకు సంబంధిత అధికారిని వెంటనే సస్పెండ్ చేయండి..సంఘటనపై ఉన్నత స్థాయి విచారణను ప్రారంభించండి. అధికారిపై చట్టపరమైన, క్రమశిక్షణా చర్యలు తీసుకునేలా చూసుకోండి. బాధిత కుటుంబానికి అవసరమైన రక్షణ, మద్దతు అందించాలని రాజాసింగ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో పేర్కొన్నారు.

# ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

మొదటి పేజీ తరువాయి




పూర్తి అవుతుందని స్పష్టం చేసింది. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పుస్తకాల ముద్రణ తుది దశలో ఉందని పేర్కొంది. జూన్ మొదటి వారంలోపుగా ముద్రణ పూర్తవుతుందని.. 2024-25 సంవత్సరానికి వినియో గించగా మిగి లిన పుస్తకాలను అవసరమైన చోట్ల పంపిణీ చేస్తున్నామని తెలిపింది. జూన్ మధ్య నాటికి 100 శాతం పుస్తకాల పంపిణీ పూర్తి చేస్తామని.. విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు అందుబాటులోకి వస్తాయని స్పష్టం చేసింది. కాగా.. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ కాలేజీలు సోమవారం తెరుచుకోనున్నాయి. ఈ ఏడాది నుంచి విద్యా సంవత్సరం సమయాల్లో ఇంటర్ బోర్డు మార్పులు తీసుకొచ్చింది. ప్రతి సంవత్సరం జూన్ 1 నుంచి విద్యా సంవత్సరం ప్రారంభమవుతుండగా ఈ ఏడాది ఏప్రిల్ 1నే ప్రారంభించారు. ఏప్రిల్ 1 నుంచి 23 వరకు తరగతులు నిర్వహించి, ఆపై వేసవి సెలవులు ఇచ్చారు. తిరిగి 2025-26 విద్యా సంవత్సరం పునఃప్రారంభం కానుంది. ఈ సంవత్సరం నుంచే కొత్తగా ఎంబైపీసీ చదివే అవకాశం విద్యార్థులకు కల్పించారు.

# మూడు నెలలకు ఒకసారి బియ్యం ఇవ్వటంతో రేషన్ షాపుల వద్ద రద్దీ!

- సన్న బియ్యానికి సర్వర్ కష్టాలు, రేషన్ షాపుల ముందు జనం బారులు!
- ఒకేసారి బియ్యం, ఆరు సంతకాలు పెట్టే పరిస్థితుల్లో అనేక ఇబ్బందులు
- కూలిపనులు, మానుకొని లైన్‌లో నిల్చోటంతో ప్రజల్లో అసహనం!
- గంటల తరబడి లైన్‌లలో నిలబడాల్సి వస్తున్నదని ఆగ్రహం
- సన్నబియ్యం కావడం, ఉచితంగా ఇవ్వడంతో డిమాండ్!

**చెన్నూరి అన్వేషి- ప్రత్యేక ప్రతినిధి, నీలగిరివార్త :**



సన్నబియ్యానికి తెలంగాణలో డిమాండ్ పెరిగింది. తెలంగాణలో రేషన్‌షాపుల ముందు ప్రజలు బియ్యం తీసుకోవడానికి పడిగాపులు కాస్తున్నారు. గంటల తరబడి ఎండలో నిలబడలేక క్యూలో సీరియల్ పోకుండా సంచులు, చెప్పులు పెడుతున్నారు. ఒక వ్యక్తికి రేషన్ ఇచ్చేందుకు దాదాపు 30 నిమిషాల సమయం పడుతుందని లబ్దిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల రేషన్ ఒకేసారి ఇవ్వడంతో ఉదయం ఆరు గంటల నుంచే క్యూలో నిల్చొని, సర్వర్ ప్రాబ్లం ఉండడంతో గంటల తరబడి క్యూ లైన్లో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎందుకు ఆలస్యమవుతుందని రేషన్ డీలర్‌లను నిలదీయగా, సర్వర్ ప్రాబ్లం ఉందని సాంకేతిక నిపుణులు వచ్చి సరి చేసేవరకు ఏం చేయలేమని సమాధానం ఇస్తున్నారు.

**కూలిపనులు, మానుకొని లైన్‌లో నిల్చోటంతో ప్రజల్లో అసహనం**

కూలి పనులు, ఉద్యోగాలు మానుకొని లైన్ లో నిలుచుంటున్నామని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల రేషన్ ఒకేసారి ఇచ్చేముందు సాంకేతిక లోపాలను సరిచేసుకోవడం తెలియదా అంటూ ప్రభుత్వాన్ని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రేషన్ ఇచ్చే ప్రక్రియ వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణలో సన్న బియ్యానికి మంచి డిమాండ్ ఏర్పడింది. రేషన్ దుకాణాల్లో తెలుపు రంగు రేషన్ కార్డు దారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తుండటంతో ప్రజలు హ్యాపీ ఫీలవుతున్నారు. గతంలో దొడ్డు బియ్యం ఇచ్చేటప్పుడు ఇంతటి రష్ ఉండేది కాదని రేషన్ దుకాణాల డీలర్లు చెబుతున్నారు. చాలా వరకూ బియ్యాన్ని తీసుకునే వారు కాదని, కొందరు తీసుకున్న బియ్యాన్ని బయట విక్రయించే వారని చెబుతున్నారు.

**సన్నబియ్యం కావడం,ఉచితంగా ఇవ్వడంతో డిమాండ్**

సన్న బియ్యం కావడంతో అందులో ఉచితంగా ఇవ్వడం, ఇంట్లో ఎంత మంది ఉన్నప్పటికీ ఒక్కొక్కరికీ ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం ఇస్తుండటంతో సన్న బియ్యానికి మంచి డిమాండ్ ఏర్పడింది. తెలంగాణలో మొత్తం 90 లక్షలకు పైగా రేషన్ కార్డులున్నాయి. అందులో మూడుకోట్ల మందికి సన్నబియ్యాన్ని తెలంగాణ ప్రభుత్వం అందిస్తుంది. ప్రతినెల రేషన్ దుకాణాలకు రెండులక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తుంది. ఎక్కడా బియ్యం కొరత అంటూ లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. కొత్త రేషన్ కార్డులు వస్తే మరో ముప్పయి లక్షల మంది లబ్దిదారులు పెరిగే అవకాశముంటున్నారు. ఈ సన్నబియ్యం పథకంకోసం కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు మొత్తం 10,615 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయి.

**ఆరు సంతకాలు.. అనేక ఇబ్బందులు**

అందులో రాష్ట్ర ప్రభుత్వం ఐదు వేలకోట్ల రూపాయలను ఖర్చు చేస్తుంది. అదనంగా ప్రభుత్వంపై 3 కోట్ల రూపాయలు భారం పడినప్పటికీ గతంలో 60 శాతం మంది మాత్రమే రేషన్ బియ్యం తీసుకునే వారని, ఇప్పుడు వందశాతం మంది తీసుకోవడం పథకం సూపర్ సక్సెస్ అయిందని చెప్పడానికి ఉదాహరణ అని ప్రభుత్వ వర్గాలు అందనున్నాయి. ఇదే సమయంలో మూడు నెలల పాటు భారీ వర్షా లు, వరదలు ఉంటాయని భావించి మూడు నెలలకు ఒకేసారి సన్న బియ్యం ఇస్తుండటంతో దీనికి డిమాం డ్ ఏర్పడింది. అందుకే రేషన్ దుకాణాలకు క్యూ కడుతున్నారు. అనేక చోట్ల రద్దీ ఉండటంతో బియ్యం తీసుకునేందుకు ఎక్కువ సమయంపడుతుంది.

**సన్న బియ్యానికి సర్వర్ కష్టాలు**

గతంలో 10 నిమిషాల్లో ఐపోయేది ఇప్పుడు ఒక్కో కార్డుకు 30 నిమిషాల సమయం పడుతున్నది. రేషన్ దుకాణాల పేరెత్తితో జనం విసిగిపోతున్నారు. సన్న బియ్యం కోసం గంటల తరబడి నిలబెడుతున్నట్లు వినియోగదారులు మండిపడుతున్న పరిస్థితి కొనసాగుతోంది. తెల్లవారక ముందే సంచులు పట్టుకుని బారులు తీరాల్సిన పరిస్థితి నెలకొన్నదని భగ్గుమంటున్నారు. పనులు మానుకుని బియ్యం కోసం వేచి చూడాల్సిన పరిస్థితులు వచ్చాయని అసహనం వ్యక్తంచేస్తున్నారు. సాధారణంగా రేషన్ దుకాణాల వద్ద బియ్యం తీసుకునేందుకు అరగంట వరకు పట్టేదని, ఇప్పుడు గంటల తరబడి లైన్‌లలో నిలబడాల్సి వస్తున్నదని ఆగ్రహంగా చెప్తున్నారు. ఒక్కో నెల బియ్యం కోసం రెండేసి సార్లు వేలిముద్ర (థంబ్) వేయాల్సి వస్తున్నదని, మొత్తం మూడు నెలల బియ్యానికి ఆరుసార్లు థంబ్ పెట్టాల్సి వస్తున్నదని విసుగు చెందుతున్నారు. లైన్‌లో తమవంతు వచ్చాక తక్కువలో తక్కువ అర గంట సమయం తీసుకుంటు చెప్తున్నారు.సర్వర్ సరిగాపనిచేయక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు, అన్నీ కలిపి ఒకే స్లిప్పుగా ఇస్తే కొంతైనా ఇబ్బందులు తగ్గుతాయని అంటున్నారు.

ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి ఇస్తుండటం లబ్ధిదారులకు కొత్త కష్టాలు తెచ్చిపెట్టింది. గత నెల వరకు రేషన్ కోసం వెళ్తే బయట లైన్‌లో 15 నిమిషాలు నిలబడితే సరిపోయేది. నేరుగా సర్వర్ చెంతకు వచ్చేవారు. అక్కడ సర్వర్ మెషిన్‌లో ఒక సారి వేలిముద్రలు పెట్టి వచ్చే కోటా బియ్యాన్ని అదే సమయంలో తూకంచేసి ఇచ్చేసేవారు. మూడు నెలల బియ్యం ఒకేసారి ఇస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒక్కో నెల కోటా బియ్యానికి ఒక్కోసారి తూకం వేయాల్సి వస్తున్నది. ఒక్కోనెల బియ్యంలోనూ కేంద్రం బియ్యానికి ఒకసారి, రాష్ట్ర కోటా బియ్యానికి మరోసారి వేలిముద్ర వేయిస్తున్నారు. మూడునెలలకు కలిపి ఆరుసార్లు వేలిముద్రలు వేస్తున్నారు. ఆయా కోటాల ప్రకారం ఆరుసార్లు బియ్యం తూకం చేస్తున్నారు. ఇది లబ్ధిదారులకు ఇబ్బందులు తెచ్చిపెడుతున్నది. ఒకేసారి మూడునెలల బియ్యం ఇస్తుండటంతో జనం రద్దీ పెరిగింది. రేషన్ దుకాణాల వద్ద బారులు పెరిగాయి. బయటే గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితి నెలకొన్నది. పొద్దున్నే లైన్‌లో 40 మంది నిలబడితే 25 మంది కోటా పూర్తయ్యేసరికే సమయం గడిచిపోతున్నది.సాయంత్రం మళ్లీ కొత్తగా మొదటి నుంచి లైన్‌లో వేచి చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.ఇది ఎక్కువ సమయాన్ని తీసుకుంటున్నదని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక ఇంట్లో ఇద్దరు వ్యక్తులున్న రేషన్‌కార్డుదారుకు నెలకు (ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున) 12 కిలోల బియ్యం వస్తాయి. ప్రభుత్వం మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి ఇవ్వాలంటే ఇద్దరున్న రేషన్‌కార్డుదారుకు ఒకేసారి 36 కిలోల బియ్యం వస్తున్నాయి. ఇందులో 10 కిలోల ఇస్తుండగా, రాష్ట్రం 2 కిలోల అందిస్తున్నది. ఇంతవరకు బాగానే ఉన్నా రేషన్ బియ్యం పంపిణీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా ఉన్నది. మూడు నెలలకు కలిపి 36 కిలోలబియ్యంలో కేంద్రం 30 కిలోలు, రాష్ట్రం 6 కిలోలు ఇస్తున్నది. సికింద్రాబాద్ మరియు కంటోన్మెంట్ ప్రాంతాల లోని రేషన్ దుకాణాల వద్ద శంకర్ పల్లిలో కొన్ని డీలర్ షాపులు ఓపెన్ చెయ్యలేదు బియ్యం కోసం వచ్చిన ప్రజలు సంచులను క్యూ లైన్ లో పెట్టిన దుస్థితి ఎల్ బీనగర్ రేషన్ డీలర్ షాప్ లవద్ద పరిస్థితి పరిశీలిస్తే వినియోగదారులు పడుతున్న ఇక్కట్లు వర్ణనాతీతం.

# కేసీఆర్‌కు నోటీసులా?

మొదటి పేజీ తరువాయి

అంటూ విమర్శించారు. ప్రాజెక్టు అంటే కేవలం మూడు బ్యారేజీలే కాదని.. ఆ ప్రాజెక్టులో 21 పంప్ హౌస్‌లు, 15 రిజర్వాయర్లు, 200 కిలోమీటర్ల మేర టన్నెల్ ఉందన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టులో 1500 కిలోమీటర్ల మేర కాలువలు ఉన్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఎత్తిపోసిన మట్టితో దాదాపు 300 పిరమిడ్లు కట్టవచ్చునని.. కాళేశ్వరంలో వాడిన స్టీల్‌తో వంద ఈఫిల్ టవర్లు కట్టవచ్చన్నారు. కాళేశ్వరంలో పోసిన కాంక్రీట్‌తో 50 బుర్జు ఖలీఫాలు కట్టవచ్చునని తెలిపారు. అంత భారీ ప్రాజెక్టు కాళేశ్వరమని.. ప్రాజెక్టు పూర్తయితే 35 శాతం తెలంగాణ భూభాగానికి నీళ్లు అందిస్తుందన్నారు. 40 టీఎంసీలతో హైదరాబాద్‌కు శాశ్వతంగా నీళ్లు ఇచ్చే ప్రాజెక్టు కాళేశ్వరమని.. మన పరిశ్రమలకు 16 టీఎంసీల నీళ్లు అందించే ప్రాజెక్టు కాళేశ్వరమని.. 90 మీటర్ల అడుగున ఉండే నీళ్లను 600 మీటర్లపైకి.. ఎత్తిపోసే ప్రాజెక్టు కేసీఆర్‌దేనన్నారు. గట్టి గుండె కాబట్టి అంత పెద్ద ప్రాజెక్టును నిర్మించారని.. కాంగ్రెస్ పార్టీ నాయకులకు కలలో కూడా అంతపెద్ద ప్రాజెక్టును కట్టాలన్న ఆలోచన రాదన్నారు. తెలంగాణ సస్యశ్యామలం కావాలని కట్టిన ప్రాజెక్టు కాళేశ్వరమని.. దాదాపు 40 లక్షల ఎకరాలకు నీళ్లు అందించే ప్రాజెక్టుపై కుట్ర చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. కేసీఆర్‌ని బద్నాం చేయడానికి మాత్రమే కాళేశ్వరం కమిషన్ వేసిందని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ హయాంలో జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం చేస్తూ 90 శాతం పనులను మెఘా కృష్ణారెడ్డి కంపెనీకి ఇచ్చారని.. మేడిగడ్డకు చిన్న చిన్న మరమ్మతులు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పొలాలను ఎండబెడుతోందని.. కాళేశ్వరం ప్రాజెక్టులో 15 పంప్ హౌస్ పనులు చేసిన మెఘా కృష్ణారెడ్డిని కమిషన్ ముందుకు పిలిచే ధైర్యం రేవంత్ రెడ్డికి లేకపోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్ల కోసం, కాంట్రాక్టర్ల కోసం మాత్రమే పనిచేస్తోందని మండిపడ్డారు. 90 శాతం పంప్‌హౌస్‌ల పనులు చేసిన కాంట్రాక్టర్‌ను ఎందుకు వదిలేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ పౌరుషాన్ని చూపించాల్సిన సమయం వచ్చిందని.. ఏపీ ప్రభుత్వం చేపడుతున్న బనకచర్ల ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు వ్యతిరేకించడం లేదంటూ నిలదీశారు. తెలంగాణ నీళ్లను ఏపీకి తరలించుకుపోతుంటే రేవంత్ రెడ్డి ఎందుకు కేంద్రానికి ఫిర్యాదు చేయడం లేదని.. గోదావరి - పెన్నా అనుసంధానం పేరిట నీళ్ల తరలింపును తక్షణమే అడ్డుకోవాలన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయాలని డిమాండ్ చేస్తున్నానన్నారు. చంద్రబాబు ఎన్డీఏలో ఉన్నందున జల దోపిడి చేసినా రాష్ట్ర బీజేపీ నాయకులు ప్రశ్నించడం లేదన్నారు. ఎనిమిది ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్నా రాష్ట్రానికి కేంద్రం నుంచి ఏమీ తేవడం లేదన్నారు. బీజేపీలో ఉన్న ఒకే ఒక తెలంగాణ బిడ్డ ఈటల రాజేందర్ కూడా మాట్లడకపోవడం శోచనీయమన్నారు. బకనచర్ల ప్రాజెక్టును ఆపే ప్రయత్నం చేసే బాధ్యతను ఈటల రాజేందర్ తీసుకోవాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకొచ్చే బాధ్యతను కూడా ఈటల రాజేందర్ తీసుకోవాలన్నారు. గోదావరి నీటిలో వెయ్యి టీ-ఎంసీల హక్కును సాధించే వరకు తెలంగాణ జాగృతి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. మంచిర్యాల, రామగుండం ప్రాంతంలో ధర్నాకు వస్తున్న జాగృతి కార్యకర్తలను అరెస్టు చేశారని మండిపడ్డారు. ప్రభుత్వం ఎందుకు ఇంత భయపడుతున్నది? ధర్నాను అడ్డుకునే ప్రయత్నం చేస్తే ఊరుకోబోమన్నారు. హైదరాబాద్‌లో ధర్నా చేయనివ్వకపోతే జిల్లాల్లో, గల్లీల్లో ధర్నా చేస్తామని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ప్రాంగణం మంగళవారం ఉదయం ఉద్రిక్త వాతావరణాన్ని చూసింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జారీ చేసిన నోటీసులకు వ్యతిరేకంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన ఈ ధర్నాకు భారీ సంఖ్యలో జాగృతి కార్యకర్తలు తరలివచ్చారు. కవిత తన వ్యాఖ్యలతో ఈ వ్యవహారాన్ని పూర్తిగా రాజకీయ కుట్రగా అభివర్ణించారు. కేసీఆర్ తన గట్టి గుండెతోనే కాళేశ్వరం లాంటి మహత్తర ప్రాజెక్టును నిర్మించారని చెప్పారు. 'ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 40 లక్షల ఎకరాలకు నీళ్లు అందించబడ్డాయి. ఇలాంటి ప్రాజెక్టుపై ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. కాళేశ్వరం కమిషన్ కాదు, ఇది కాంగ్రెస్ కమిషన్. ప్రాజెక్టును బద్నాం చేయడమే వారికి గోల్,' అని విమర్శించారు. బీజేపీపై కూడా కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'తెలంగాణ బీజేపీ నేతలు కేంద్రాన్ని ప్రశ్నించడం లేదు. ఎన్డీఏలో చంద్రబాబు ఉన్నాడన్న కారణంతో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని పట్టించుకోవడం లేదు. ఒకే ఒక తెలంగాణ బిడ్డ ఈటల రాజేందర్ కూడా నోరు విపించకపోవడం శోచనీయం. ఆయన కనీసం బకనచర్ల ప్రాజెక్టు విషయాని-కై-నా స్పందించాలి. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకురావాల్సిన బాధ్యతను కూడా ఈటల తీసుకోవాలి,' అన్నారు. ఈ ధర్నా సందర్భంగా పోలీసులు జాగృతి కార్యకర్తలను అరెస్ట్ చేసిన అంశాన్ని కూడా కవిత తీవ్రంగా ఖండించారు. 'మంచిర్యాల, రామగుండం ప్రాంతాల నుంచి ధర్నాకు వస్తున్న కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేయడం ఎంత దుర్మార్గం. ధర్నాను అడ్డుకునే ప్రయత్నం చేస్తే ఊరుకోబోము. హైదరాబాద్‌లో అవకాశం ఇవ్వకపోతే, జిల్లాల్లో, గల్లీల్లో ధర్నాలు చేస్తాం. ఇది ఉద్యమం,' అని స్పష్టం చేశారు. తుదిగా, గోదావరి నీటిపై తెలంగాణకు వున్న హక్కును సాధించే వరకు తమ పోరాటం ఆగదని, తెలంగాణ జాగృతి ఉద్యమం మరోసారి సజీవంగా మారిందని కవిత జోష్ చూపించారు. ఈ ధర్నా ద్వారా కవిత తిరిగి బలమైన రాజకీయ చైతన్యాన్ని ప్రదర్శించినట్టు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# కవిత లేఖ వెనక కెసిఆర్ వ్యూహం

**అటెన్షన్ డైవర్ట్ చేయడానికే అన్న కొండా**

**హైదరాబాద్- నీలగిరివార్త :** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన లేఖ రాజకీయ డ్రామా మాత్రమేనని, దీని వెనుక అసలు స్కెచ్‌ను మాజీ సీఎం కేసీఆరే తయారుచేశారని బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ఈ డ్రామా ద్వారా కవిత మీడియా దృష్టిని ఆకర్షించగలి గిందని, హెడ్‌లైన్లలో నిలవడమే లక్ష్యంగా ఇది సాగించబడిందని వ్యాఖ్యానించారు. కవిత తన ఉద్దేశాన్ని సాధించగలిగింది. బీఆర్ఎస్ ప్రజాదరణ కోల్పోతుండటంతో దృష్టి మళ్లించేందుకు ఇది వ్యూహాత్మకంగా తయారుచేసిన స్క్రిప్టు అని అన్నారు. ఇది పూర్తిగా ట్రాష్ డ్రామా. కేసీఆర్ ఫామ్ హౌస్ నుంచే ఈ స్కెచ్‌లన్నీ జరుగుతున్నాయని కొండా తీవ్రంగా విమర్శించారు. కేసీఆర్ కుటుంబం రాజకీయాల్లో ప్రొఫెషనల్. అవసరమైతే కాళ్లు పట్టుకుంటారు, లేకపోతే జుట్టు పట్టి తన్నేస్తారు. ఇదే వారి రాజకీయం, అని ఘాటుగా వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్-బీజేపీ కలయికపై వస్తున్న ఊహాగానాలను కొండా ఖండించారు. 'కేసీఆర్ కుటుంబ సభ్యులు బీజేపీ వద్దకు వస్తే గేట్ వద్దే తన్ని తరిమేస్తాం,' అని మండిపడ్డారు. రాజకీయాల్లో సమీకరణాలు మారినా కొన్ని విలువలు మారవని స్పష్టం చేశారు. కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో సె-టైర్లు వేసిన కొండా.. 'కేసీఆర్‌కు కుటుంబమే ప్రథమం, పార్టీ రెండవది, తెలంగాణ చివరిది,' అని అన్నారు. మునుగోడు ఉపఎన్నికల సందర్భాన్ని గుర్తు చేస్తూ, కాంగ్రెస్‌తో బీఆర్ఎస్ అప్పుడే పొత్తు పెట్టు-కుందని ఆరోపించారు. మేమైతే కవితను అరెస్ట్ చేశాం. మరి కాంగ్రెస్ ప్రభుత్వాలు కేసీఆర్, కేటీఆర్‌ను ఎవరినైనా అరెస్ట్ చేశాయా అని సూటిగా ప్రశ్నించారు.

# రాహుల్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదు

**మాజీ ఎంపి విహెచ్ హెచ్చరిక**

**హైదరాబాద్ :** ఆపరేషన్ సిందూర్‌పై దేశంయావత్తూ మోడీకి అండగా నిలిచినా,ట్రంప్ ఫోన్‌తో మోడీ లొంగిపోవడం దారుణమని మాజీ ఎంపి వి. హనుమంతరావు అన్నారు. ఇదే విషయాన్ని రాహుల్ చెప్పారని, ఆపరేషన్ సిందూర్‌ను ఎక్కడా విమర్శించలేదన్నారు. పెహల్గాంలో 27 మంది భారతీయులను చంపిన దుర్మార్గం చర్యపై ప్రతి భారతీయుడు చాలా సీరియస్ గా ఉన్నారని కాంగ్రెస్ సీనియర్ నేత వీ.హనుమంతరావు అన్నారు. దేశంలో ఉన్న అన్ని పార్టీలు, ప్రధాని మోడీకి ఫ్రీ హ్యాండ్ ఇచ్చారని.. ఆ తర్వాత 9 ఉగ్రవాద స్థావరాల మీద ఆపరేషన్ సిందూర్ చేయడం జరిగిందన్నారు. అమెరికా ప్రెసిడెంట్ మోడీని లొంగిపో అన్నారని.. అమెరికా ఒత్తిడికి లొంగి ఆపరేషన్ సింధూర్ ఆపేశారని ఆరోపించారు. భారత దేశానికి చెందిన ఏ విషయంలో అయినా క్రెడిట్ మన దేశానికే రావాలని.. అమెరికా కి కాదన్నారు. తమకు భారత రక్షణ దళాల మీద అత్యంత గౌరవం ఉందని స్పష్టం చేశారు.

# ఇథనాల్ కంపనీ!

మొదటి పేజీ తరువాయి

పెట్టే ఫ్యాక్టరీని నిర్మించొద్దంటూ నిరసన నిరహార దీక్షలు కొనసాగించినట్లు-పేర్కొంది. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ అలంపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి సంపత్ కుమార్ హామీతో దీక్షలు విరమించామని గుర్తు చేసింది. అర్ధరాత్రి దొంగ దెబ్బ తీస్తారని ఊహించలేదని పేర్కొంది. ప్రజలందరూ ఏకతాటిపైకి వచ్చి, శాంతియుతంగా పోరాడుతున్న సమయంలో ప్రజలపై దాడి చేసేందుకు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే దురుద్దేశంతో ప్రైవేట్ సైన్యాన్ని మోహరిస్తూ ఫ్యాక్టరీ యాజమాన్యం ఏం కోరుకుంటుందని.. ప్రజల సహనాన్ని పరీక్షించడం దేనికి సంకేతమని ప్రశ్నించింది.

# పాలన చేతగాని కాంగ్రెస్

మొదటి పేజీ తరువాయి

కోడెలను కాపాడుతాం అని స్పష్టత ఇచ్చారు. ఈ మధ్యే మాపై కేసులు పెట్టడం, కమిషన్లు ఏర్పాటు చేయడం తప్ప అసలు సమస్యలపై ప్రభుత్వాన్ని పట్టించుకోడం లేదని, నిజమైన ప్రజా సమస్యలను వదిలి మిగతా విషయాల్లో బిజీ అయ్యారని తెలిపారు. ఇక రేపటి కేబినెట్ సమావేశంలో రైతు బంధు డబ్బులను వెంటనే విడుదల చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని తీవ్రంగా పిలుపునిచ్చారు.

# ఏజ్‌బార్ రిటైర్‌మెంట్!

మొదటి పేజీ తరువాయి

ప్రధానంగా చర్చ జరిగే అవకాశం ఉందని ఉద్యోగులు భావిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వానికి ఉద్యోగ సంఘాలకు మధ్య భేదాభిప్రాయాలు రావడం, సర్కారు వెంటనే అధికారుల కమిటీని ఏర్పాటు చేసిందే! ప్రస్తుతం ఈ కమిటీతో ఉద్యోగ సంఘాలు భేటీ అయ్యాయి.ఈ కమిటీ ఉద్యోగుల డిమాండ్లను, ప్రతిపాదనలను విని మే 31న తన నివేదికను మంత్రివర్గ ఉపసంఘానికి అందజేసింది. ఆ నివేదికపై క్యాబినెట్‌లో కీలక చర్చ జరగనుంది. కాగా, ఉద్యోగులు కోరుతున్న ఐదు డీఏలలో ఒక డీఏపై ప్రభుత్వం సానుకూలంగా ఉండగా రెండో డీఏ ఇచ్చే విషయంపై చర్చ జరగనుంది.

**పెండింగ్ బిల్లుల చెల్లింపుపై పైనా స్పష్టత!?**

అదే విధంగా పెండింగ్ బిల్లుల చెల్లింపుపై ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నట్లు రూ.11 వేల కోట్లను గ్రీన్ చానల్ ద్వారా ఒక్కో విడతలో ఎంత చెల్లించాలనే దానిపైనా స్పష్టత వస్తుందని భావిస్తు న్నారు. నెలకు రూ.1000 కోట్ల చొప్పున చెల్లిస్తారా? లేక విడతల వారీగా ప్రాధాన్య క్రమంలో చెల్లింపులు ఉంటాయా? అనే అంశాలపై క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇక ఉద్యోగుల సాధారణ బదిలీలు ఏటా చేయడానికి ప్రభుత్వం సుముఖంగానే ఉంది. ఉద్యోగుల ఆర్థికేతర డిమాండ్లలో 44 డిమాండ్లను అధికారుల కమిటీ నివేదికలో ప్రధానంగా ప్రస్తావించగా.. అందులో దాదాపు అన్ని డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. మంత్రివర్గంలో చర్చించాల్సిన అంశాల పైన ఈ భేటీలో చర్చించి.. పరి ష్కార మార్గాలను కేబినెట్ కు ప్రతిపాదించనున్నారు. దీంతో, ఈ సారి ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం దొరికే అవకాశం కనిపిస్తోంది.

# విజయోత్సాహంలో విషాదం

మొదటి పేజీ తరువాయి

తోపులాట జరిగింది. ఈ ఘటనలో 10 మంది మృతి చెందగా, 50 మందికి పైగా గాయపడ్డారు. క్షతగాత్రులను సమీపంలోని వివిధ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల్లో ఆరుగురు పురుషులు, నలుగురు మహిళలు ఉన్నారు. ఎన్నో పరాభవాల తర్వాత ఆర్సీబీ కల నెరవెరడంతో దేశవ్యాప్తంగా బెంగళూరు టీమ్ అభిమానులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు. ఆర్సీబీ టీమ్ ట్రోఫీతో తొలిసారి బెంగళూరుకు రాగా.. ఫ్యాన్స్ ఘన స్వాగతం పలికారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ విమానాశ్రయానికి వెళ్లి జట్టుకు స్వాగతం పలికారు. అనంతరం బెంగళూరు జట్టు ప్రత్యేక బస్సులో విధాన సౌధకు చేరు కుంది. ఈ క్రమంలో వేలాది అభిమానులు ఆర్సీబీ జెండాలు చేతబూని విధాన సౌధ వద్దకు చేరుకున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా 'ఎర్రసముద్రాన్ని' తలపించింది. ఆటగాళ్లు వస్తున్న మార్గంలోనూ అభిమానులు సందడి చేశారు.

# 2027 మార్చి 1 నుంచి జనాభా లెక్కలు

మొదటి పేజీ తరువాయి

పైనా స్పష్టత లేకుండా పోయింది. సరైన సమయంలో నిర్వహిస్తామని 2024లో ఓ సందర్భంలో కేంద్ర మంత్రి అమిత్ షా తెలిపారు. 16 ఏళ్ల తర్వాత తొలిసారి జనాభా గణన నిర్వహించనున్నారు.

printed, Published and Owned by GUNTOJU VISHNU MURTHY, Printed at V.M. PRINTERS Plot No : 08, Shiva shankar colony, Kuntloor( vil), Abdulpurmet(mdl), Rangareddy(dist). Telangana. Published at V.M.PUBLICATIONS Plot No : 108, Shiva shankar colony, Kuntloor( vil), Abdulpurmet(mdl),Telangana State. Pin : 501505, Editor : GUNTOJU VISHNU MURTHY, RNI No : APTEL/31957/2009. Cell No : 96765 49223.

# స్ట్రీట్ లైట్ల గురించి మేయర్‌కు వివరించిన శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్





శేరిలింగంపల్లి నీలగిరి వార్త ప్రతినిధి

జిహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జిహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో శేరిలింగంపల్లి డివిజన్ లో నెలకొన్న స్ట్రీట్ లైట్స్ పలు సమస్యలపై మేయర్ ద్వారా అధికారులను ప్రశ్నిస్తూ.. ప్రసంగించిన శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ .

# మూడు నెలల రేషన్ బియ్యం జూన్‌లోనే పంపిణీ చేస్తున్న మోదీ ప్రభుత్వం

**రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందుగానే ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం**

**సారా జగన్ బీజేపీ వికారాబాద్ జిల్లా కార్యదర్శి..**

నీలగిరి వార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి



ఒక్క జూన్ నెలలోనే 3 నెలల రేషన్ బియ్యం ఇవ్వడం ఒక మోదీ ప్రభుత్వానికి సాధ్యం అని బీజేపీ జిల్లా కార్యదర్శి సారా జగన్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేసేది పేద ప్రజల ఆకరణ తీర్చేది కేంద్ర ప్రభుత్వమే రాబోయే వర్షాకాలంలో పేద ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఒకేసారి 3 నెలలకు సరిపడ రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వానికి ప్రజలందరి తరపున ధన్యవాదాలు తెలుపుతున్నాను అని వ్యాఖ్యానించారం. రాబోయే రోజుల్లో భారీ వర్షాలు వరదలు వచ్చే అవకాశం ఉన్నందున రేషన్ బియ్యం పంపిణీ చేయడానికి రవాణా చేయడానికి ఇబ్బంది అవుతుంది అని ముందు చూపుతూనే మోదీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకు న్నట్లు తెలిపారు. జూన్ 1 వ తేదీ నుండి 30 తేదీ వరకు పంపిణీ చేయాలని ఆదేశాలు ఇవ్వడం పట్ల బీజేపీ జిల్లా కార్యదర్శి సారా జగన్ హర్షం వ్యక్తం చేశారు. భారతదేశంలోని చిట్ట చివరి గ్రామన్నీ అభివృద్ధి చేసేది పేద ప్రజల ఆకలిని తీర్చేది కేంద్రంలో ఉన్న మోదీ గారి ప్రభుత్వమే అని.

# ఘనంగా రిటైర్డ్ ఎంఈఓ సాంఘిక సేవా కార్యకర్త రామరాజు జన్మదిన వేడుకలు






నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి

మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం 1503వ.రోజు కార్యక్రమంలో భాగంగా రిటైర్డ్ ఎంఈఓ సాంఘిక సేవా కార్యకర్త చెన్నమాధవుని రామరాజు జన్మదినం సందర్భంగా ట్రస్టు ఆధ్వ ర్యంలో శాలువాతో సత్కరించి అనంతరం కేక్ కట్ చేయించి అన్నార్తులకు అభాగ్యులకు కేకుతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ తెలియజేశారు సన్మాన గ్రహీత రామ రాజు మాట్లాడుతూ మనం ఒక్కరోజు ఒక కార్యక్రమం చేయాలి అంటేనే ఎంతో ముందుగా ప్లాన్ చేసుకుంటాము. అలాంటిది కరోనా కష్టకాలంలో అన్నం దొరకని పేదలకు ఆహారం అందించడం అంతే కాకుండా ఆరోజు నుండి ఈరోజు వరకు 1503 రోజులుగా ఎండొచ్చినా, వానొచ్చినా ఆగ కుండా మధ్యాహ్నం 12.30కి అన్నదానం చేయడం అభినందనీయమని అన్న దానానికి సహకారం అందిస్తున్న దాతలకు మరియు సేవా కార్యక్రమంలో పాల్గొని సేవలు అందిస్తున్న ట్రస్ట్ సభ్యులను ఈ సందర్భంగా అభినందిం చారు. అంతే కాకుండా నేను కూడా మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ నందు సభ్యుడిగా ఉండడం నా అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ కార్యక్ర మంలో ట్రస్టు సభ్యులు మధు మహేష్, డాక్టర్ బెజ్జంకి రవీందర్, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, పాత సంతోష్, పొలాస రాజేందర్ తోట రాజు సగ్గు రాహుల్ మరియు చెన్నమాధవుని రామరాజు సతీమణి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 28వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు





హయత్ నగర్ నీలగిరి వార్త :

ఘనంగా వనస్థలి శబరిమల అయ్యప్ప దేవస్థానంలో 28వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయని ఈ మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా జరగడంతోపాటు 5వ తారీఖు చివరి రోజు కావడంతో చండీ హోమం ఉంటుందని తెలియజేశారు. ప్రతిరోజు ఉదయం సుప్రభాతము నిత్య భిషేకము అర్చనా హారతి మధ్యాహ్నము అన్నదాన కార్యక్రమాలు సాయంత్రం పడిపూజ నిర్వహించ బడుచున్నవని అని ఆలయ కమిటీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భక్తజన సందోహం రావటంతో ఎంతో ఆనందంగా ఉన్నదని ఆలయ చైర్మన్ ఎం విటల్ యాదవ్ అధ్యక్షులు జి దాసు గౌడ్ ఈ సందర్భంగా అన్నారు ఈ కార్యక్రమంలో వి ఆనందరావు జి అరవింద్ గౌడ్ ఇరగవరపు రత్నమాల ఈ కృష్ణారావు శ్రీకాంత్ యాదవ్ భాస్కరరావు గుండం సత్యనారాయణ గుమ్మిడి కృష్ణారెడ్డి గూడూరు సంజీవరెడ్డి ఎన్ గోవర్ధన్ రావు ఎం ప్రేమ్ రాజ్ సాయి రిషికేష్ యానాల కృష్ణారెడ్డి శివకుమార్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

# పశువుల అక్రమ రవాణాను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్‌లను తనిఖీ చేసిన ఎస్పీ

కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త: సుందర్:

కామారెడ్డి జిల్లాలో పశువుల అక్రమ రవాణాను నియంత్రించేందుకు జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఘన్పూర్ చెక్‌పోస్ట్, భిక్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని టోల్‌ప్లాజా, బస్వాపూర్ చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

పశువుల అక్రమ రవాణా నియంత్రణకు జిల్లాలో నిరంతర పర్యవేక్షణ

నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుంది .

చెక్పోస్ట్ వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండి వాహనాలు తనిఖీ చేయాలని సూచించారు

రాత్రి సమయంలో తప్పకుండా టార్చ్ లైట్ ఉపయోగించాలని తెలిపారు.



ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, కామారెడ్డి జిల్లాలో పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా సరిహద్దుల్లో మొత్తం ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, వీటిలో 24/7 నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. పోలీసు శాఖతో పాటు ఇతర సంబంధిత శాఖల సిబ్బంది సమన్వయంతో షిఫ్ట్‌ల వారీగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీ, వాహనాల ఎంట్రీ రికార్డుల పరిశీలనను స్వయంగా పరిశీలించి, అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి తగిన సూచనలు చేశారు.

శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పశువుల రవాణా విషయంలో ఎలాంటి వివాదాలు తలెత్తకుండా ముందస్తు చర్యగా ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా జంతువుల అక్రమ రవాణావంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. సంబంధిత వాహనాల్లో చట్టబద్ధమైన ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉండాలని, అక్రమ రవాణా జరిగితే సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అదే విధంగా ఏ వ్యక్తి లేదా సంస్థ స్వయంగా వాహనాలను ఆపకూడదనీ, ఈ విషయంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా అనుమానాస్పద అక్రమ రవాణా గమనించిన పక్షంలో వెంటనే డయల్ 100కు గాని లేదా నేరుగా సంబంధిత పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

అదేవిధంగా సోషల్ మీడియాలో ద్వేషపూరిత, రెచ్చగొట్టే మరియు అసభ్యకరమైన పోస్టులు పెడితే, వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా, మత సామరస్యంతో జరుపుకునేలా అవసరమైన చోట్ల ముందస్తుగా పటిష్టమైన పోలీసు బందోబస్తు, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పి తెలిపారు.

# వేములవాడ రాజన్న దేవాలయ కోడెల మరణం తెలంగాణ రాష్ట్రానికి అరిష్టం

**గత వారం రోజులుగా భక్తులు సమర్పించిన కోడెలు మరణించడం భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నాయి..**

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు**

నీలాగిరి వార్త వేములవాడ ప్రతినిధి

వారం రోజులుగా రోజూ కోడెలు చనిపోతుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్టైనా లేకపోగా కనీస స్పందన కూడా లేదు..రాష్ట్ర ప్రభుత్వానికి కనీసం కోడెలకు గడ్డిపెట్టే పరిస్థితి కూడా లేదా? ఎందుకు ఇంత నిర్లక్ష్యం?.కలెక్టర్ అధికారులు, దేవాదాయ శాఖ, పశు సంవర్ధక శాఖ ఏం చేస్తున్నట్టు?.దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ దేవస్థానం పరిస్థితే ఇలా ఉంటే ఎలా?. కోడెలను కాపాడలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకాకపోతే, బీఆర్ఎస్



పార్టీకి కోడెల సంరక్షణ బాధ్యత అప్పగించండి మీకు ప్రజలు అంటే లెక్కలేదు, దేవుళ్ళంటే లెక్కలేదు అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు తెలిపారు

# తెలంగాణ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచందర్ యాదవ్



శేరిలింగంపల్లి నీలగిరి వార్త ప్రతినిది

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి నిరంతరం ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని సమస్యలను పరిష్కరించే మహా నాయకుడు తెలంగాణ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. బేరి రామ చందర్ యాదవ్ బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచందర్ యాదవ్. వికారాబాద్ జిల్లాలో ప్రతినిత్యం ప్రజల కష్టనష్టాలలో పాలుపంచుకుంటూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్న గొప్ప నాయకుడు గడ్డం ప్రసాద్ అన్న , వారు మునుముందు మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని తెలంగాణ రాష్ట్రంలో ఉన్నత పదవులు చేపట్టాలని మన స్పూర్తిగా ఆశిస్తూ వారికి మరోసారి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను అని అన్నారు. వికారాబాద్ జిల్లా అభివృద్ధి ముఖ్యంగా మొయినాబాద్ నుండి వికారాబాద్ వరకు రహదారి చాలా అధ్వానంగా ఉంది. మరి మీ హయాంలో గ్రామాలకు వెళ్లే రహదారులు మరియు ఆలూరు దగ్గర జరిగిన సంఘటన కూడా మీకు తెలిసిందే. మీరు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కచ్చితంగా ఈ రహదారిని త్వరగా నిర్మాణం చేయాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో జంగయ్య యాదవ్, మరియు చాలామంది అభిమానులు ప్రజా ప్రతినిధులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే, నేతలు





తాండూరు / జూన్ 4 :

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, నేతలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను హైదరాబాద్ లో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, తాండూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వినాయక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి చైర్మన్ వర్త్య విఠల్ నాయక్ లు పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో మీరు చిరకాలం ప్రజాసేవలో కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారు. ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అభిమానులు, తదితరులు ఉన్నారు.

# 24 గంటల్లో దోపిడీ కేసును చేధించిన వేములవాడ పట్టణ పోలీసులు...

**దోపిడీకి పాల్పడిన ఇద్దరు నిందుతులు అరెస్ట్ , రిమాండ్ కి తరలింపు..**

**09 గ్రాముల బంగారం,ఒక గ్యారెంటీ చైను, ఒక కత్తి, ఆటో రెండు సెల్ ఫోన్స్ స్వాధీనం.**

**వివరాలు వెల్లడించిన వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్..**

నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి




నిందుతుల వివరాలు..

%ూ%-1 బోదాసు అశోక్ రాములు వడ్డెర ఎల్లంపేట, అన్నారం మాచారెడ్డి మండలం కామారెడ్డి జిల్లా ప్రస్తుత నివాసం బాలానగర్, వేములవాడ టౌన్ .

%ూ%-2 బొమ్మిడి గణేష్ బాలయ్య రేకుర్తి, కొత్తపల్లి మండలం కరీంనగర్ జిల్లా ప్రస్తుత నివాసం జాతర గ్రౌండ్, వేములవాడ టౌన్ .

ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ఈనాయత్ నగర్ గ్రామం కమ్మర్పల్లి మండలం నిజామాబాద్ జిల్లాకు చెందిన బడవత్ తిమ్మి భర్త మనోహర్ అనే మహిళ తేదీ 01-06-2025 రోజున వేములవాడ దైవదర్శనానికి రాత్రి సుమారు 7:30 గంటలకు రాగా, తిప్పాపూర్ బస్టాండ్ ముందు ఆటో స్టాండ్ వద్ద ఒక వ్యక్తి నిలబడి ఆమెను మీ బంధువులు గుడి వద్ద ఉన్నారని నాకు తెలుసని మిమ్మల్ని గుడి వద్దకు తీసుకు వెళ్తానని మాయమాటలతో నమ్మించి ఆమెను తన ఆటోలో ఎక్కించుకొని వేములవాడలోని చెక్కపల్లి రోడ్డులో గల పెద్దమ్మ టెంపుల్ ప్రాంతానికి తీసుకువెళ్లి, అక్కడ ఎవరు లేని సమయంలో ఆమెను కత్తి తో బెదిరించి ఆమె మెడలో నుండి బంగారు ఆభరణాలైన 3 గ్రాముల పుస్తెలు,4 గ్రాముల చెవి కమ్మలు,2 గ్రాముల మాటీలు మరియు ఒక గ్యారెంటెడ్ చైను మరియు పరుసులో ఉన్న నగదు డబ్బులు సుమారు 3000 రూపాయలు ఆమె నుండి దోపిడీ చేసుకొని పారిపోగా,తేదీ 03-06-2025 రోజున బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా తేదీ 04.06.2025 రోజున సంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితుడు అయిన బోదాసు అశోక్ ఎల్లంపేట, కామారెడ్డి అనునతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా అట్టి దోపిడి చేసిన బంగారు ఆభరణాలను కొన్ని తనవద్ద ఉంచుకొని మిగతావి తన స్నేహితుడు అయిన బొమ్మిడి గణేష్ వద్ద దాచి పెట్టినానని తెలుపగా ఇద్దరు వ్యక్తులను ఈ రోజు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 3 గ్రాముల పుస్తెలు 4 గ్రాముల చెవి కమ్మలు, 2 గ్రాముల మాటీలు ఒక రోల్డ్ గోల్డ్ చైన్ ఒక కత్తి రెండు సెల్ ఫోన్లు, ఒక ఆటో స్వాధీన పరుచుకొని రిమాండ్ కు తరలించడం జరిగింది తెలిపారు నిందితుడు అయిన బోదాసు అశోక్ ఎల్లంపేట, కామారెడ్డి గతంలో కూడాఅను అతనిని కూడా నమ్మించి తిప్పాపూర్ బస్ స్టాండ్ వద్ద నుండి ఎటిఎంఎం కు వెళ్ళి వస్తానని అతని బజాజ్ బండి దొంగిలించినాడు. నిందితులను 24 గంటలలో పట్టుకున్న వేములవాడ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ లత కానిస్టేబుల్ లు గోపాల్ సమీయుద్దీన్ లను జిల్లా ఎస్పీ అభినందించారు.ూ



## భారాన్ని మించిన మానవత్వం

**చూపరుల కంట ఆగని కన్నీరు**

**చలించిన బంధువుల హృదయాలు**

**మానవత్వం పరిమళించే మంచి మనిషికి (మంచి నాయకులకు)స్వాగతం**

**అనే సినిమా పాట వీరికి తగ్గట్టుగా ఉంది.**



నీలగిరి వార్త, సూర్యాపేట:-

సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన జర్నలిస్టు కొండ్లె కృష్ణయ్య మాతృమూర్తి చనిపోగా బుధవారం అంత్యక్రియలకు హాజరైన మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, 39 వ వార్డు ఇన్చార్జి గడ్డం వెంకన్నలు ఆమె పాడెను మోస్తూ ఉండగా చూపరుల,బంధువుల హృదయాలు చలించి కంట కన్నీరును తెప్పించాయి. చూడటానికి వచ్చిన కాంగ్రెస్ నాయకులు ఇలా సహాయం చేయడంతో స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి ఎక్కడ అంత్యక్రియలకు వెళ్లిన కూడా ఇలాంటి పుణ్యం, గొప్ప సహాయం చేస్తుండటం అందరికీ తెలిసిన విషయమే.దామన్న శిష్యులుగా పేరున్న నాయకులు ఆయనని ఆదర్శంగా తీసుకొని ఇలాంటి పుణ్య కార్యక్రమాలు చేయడం అరుదుగా కనిపిస్తూ ఉంటారు. ఏది ఏమైనా వీరికి హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే.

## డీఈఓకు వినతి పత్రం సమర్పించిన టీయూడబ్ల్యూజే, (ఐజేయు)

**జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి**



దేవరకొండ నీలగిరి వార్త

నల్గొండ జిల్లా పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల ప్రింట్ %డ% ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న వారి పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని పియూడబ్ల్యూజే (ఐజేయు)జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి, జర్నలిస్టు సంఘాల నాయకుల ఆధ్వర్యంలో బుధవారం డీఈవో బిక్షపతికి వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన డిఈఓ మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం రాయితీ ఇప్పించేందుకు అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో అమలయ్యేందుకు కృషి చేస్తానని డిఇఓ హామీ ఇచ్చారు. ఏదైనా పాఠశాల యజమాన్యం వినకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వెంటనే ప్రొసీడింగ్ ఇవ్వాలని అధికారులను వెంటనే ఆదేశించారు. డీఈఓ కు వినతి పత్రం సమర్పించిన వారిలో ప్రెస్ క్లబ్ జిల్లా అధ్యక్షులు మాదరి యాదగిరి, జిల్లా నాయకులు పులిమామిడి మహేంద్ర రెడ్డి, టౌన్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఏరెడ్ల చంద్రశేఖర్ రెడ్డి, జర్నలిస్టులు గంగాధర్ వెంకటేశ్వర్లు, సోమ చంద్రశేఖర్, జిల్లా యాదయ్య, అంజయ్య, అశోక్, తెలుగ మల్ల దశరథ, రాంప్రసాద్, ఊర రమేష్ తదితరులు ఉన్నారు.

## భద్రకాళి చెరువు మత్తడి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య.**

హనుమకొండ నీలగిరి వార్త.

హనుమకొండ భద్రకాళీ చెరువు మత్తడి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సాగునీటి పారుదల శాఖ అధికారులను హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. బుధవారం హనుమకొండ కాపువాడ సమీపంలోని భద్రకాళి చెరువు మత్తడి నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. భద్రకాళి చెరువు అవుట్ ఫ్లో స్ట్రక్చర్ నిర్మాణ పనుల పురోగతి గురించి సాగునీటి పారుదల శాఖ డిఈ మధుసూదన్ రెడ్డి, ఏఈ వేణుగోపాల్ జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ భద్రకాళి చెరువు అవుట్ ఫ్లో స్ట్రక్చర్ నిర్మాణ పనుల్లో మిగతా పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ నాయబ్ తహసిల్దార్ రంజిత్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.





## బక్రీద్ కోసం ఏర్పాట్లు పూర్తి

దేవరకొండ నీలగిరి వార్త

ఈ నెల 7 న శనివారం రోజు జరగబోయే బక్రీద్ పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని దేవరకొండ ఈద్గాహ్ కమిటీ అధ్యక్షులు సయ్యద్ అజీమోద్దీన్ పేర్కొన్నారు. నగరంలో ప్రధానంగా ఈద్గాహ్ వద్ద జరగబోయే ఔద్ – ఉల్ –జుహ .ప్రత్యేక నమాజ్ కోసం ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు ఉదయం 9 గంటలకు నమాజ్ ఉంటుందన్నారు. త్రాగునీరు, వజూ నీరు కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయని, వృద్ధులు వికలాంగులకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఈద్గాహ్ వద్ద పార్కింగ్ కోసం కేటాయించిన స్థలంలో తమతమ వాహనాలను పార్క్ చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. బందోబస్తులో ఉన్న పోలీస్ వారికి పూర్తి స్థాయిలో సహకరించాలని తెలిపారు, లినమాజ్ కు వచ్చే వారు తమ వెంట జానిమాజ్ తీసుకోరావాలని ఈ సందర్భంగా కమిటీ కోరింది. అదేవిధంగా ఈద్గాహ్ వద్ద నమాజ్ అందనివారికి 9 : 30 గంటలకు నగరంలోని జామియా మస్జిద్ లో ఏర్పాట్లు చేశామన్నారు.. ఒకవేళ పండుగ రోజు వర్షం కురిస్తే నగరంలోని ప్రధాన మస్జీదులైన మక్కా మస్జీద్, జామియా మస్జీద్, అఖ్సా మస్జీద్, ఖుతుబ్ షాహీ మస్జిద్ లలో 9 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మహ్మద్ షబ్బీర్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఇలియాస్



పటేల్, యమ్ ఏ అబ్దుల్ ఖదీర్, సయ్యద్ దస్తగిర్, మహ్మద్ షబ్బీర్, ఎస్ కె బురానొద్దీన్, మహ్మద్ ముజీబ్, ఖాజా మైనొద్దీన్, మహ్మద్ జాఫర్, మహ్మద్ షకీల్, సయ్యద్ అజీజ్, యండి సలీమ్, మహ్మద్ అఫ్రోజ్, మహ్మద్ షఫీఉల్లా, యండి ఖాజా, ఎస్ కె ఇల్యాస్ బాబా, హమీద్, ఎస్ కె మంజూర్, అజ్మత్, ఇస్మాయిల్, బారి, షేహభాజ్, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి... పేదలకు పెన్నిధి...



నీలగిరి వార్త, సూర్యాపేట:-

సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిదని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నమన్నారు.ఈ నేపథ్యంలో సూర్యాపేట మండలం 03,ఆత్మకూర్05, పెన్ పహాడ్04, చివ్వేంల06, సూర్యాపేట పట్టణం 20 మంది లబ్దిదారులకు మొత్తం 38 చెక్కులు 15 లక్షల 9500 రూపాయల విలువ చేసే చెక్కులను రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, కొప్పుల వేణారెడ్డి చేతుల మీదుగా అందజేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన రోజు నుండి ఇప్పటివరకు సూర్యాపేట నియోజకవర్గానికి మొత్తం 87 మంది లబ్ధిదారులకు 34 లక్షల 9500 విలువ చేసే చెక్కులు అందించామన్నారు. అందుకున్న వారు మాట్లాడుతూ వైద్య సహాయం కోసం సీఎం రేవంత్ రెడ్డి అందించిన నిధులు తమకు అందేలా కృషి చేసిన సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ,మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, మార్కెట్ డైరెక్టర్ ధరావత్ వీరన్న నాయక్, చింతమల్ల రమేష్, తెలంగాణ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు వేములకొండ పద్మ,దివ్య, మందాడి శేఖర్,నాగుల వాసు,మద్దెబోయిన శ్రీనివాస్, తంగెళ్ల కర్ణాకర్ రెడ్డి, సిరివెళ్ల శబరినాథ్, అనంతుల యాదగిరి, మాద నవీన్, పందిరి మల్లేష్, గండూరి రమేష్, గద్దల శిరీష శేఖర్,అంతటి పాపయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

## ఎస్పీ బాలు జయంతి వేడుకలు



నీలగిరి వార్త, సూర్యాపేట:-

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా బాల్ భవన్ సమ్మర్ క్యాంప్ నందు బాల్ భవన్ మరియు జ్ఞాన సరస్వతి కళా వేదిక బుర్రి వెంకటేశ్వర్లు అలియాస్ జూనియర్ ఘంటసాల సంయుక్త ఆధ్వర్యంలో గాన గంధర్వుడు ఎస్పీ బాలు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అతిథిగా విచ్చేసిన బాల్ భవన్ అభివృద్ధి కమిటీ సభ్యులు విశ్రాంత అధ్యాపకులు కవి హమీద్ ఖాన్ మాట్లాడుతూ ఎస్పి బాలసుబ్రహ్మణ్యం పాడితే చెవిలో అమృతం పోసినట్టు ఉండే ఆయన స్వరం అజరామరం ,వారు పలు భాషల్లో పాడారని,కొందరు యువ నటులకు ఆయన పాట స్వరంతో గుర్తింపు వచ్చిన సందర్భాలు ఉన్నాయని అన్నారు. వారు కరోనా మహమ్మారి బారిన పడి మనకు దూరం అవడం బాధాకరం అని,పద్మశ్రీ ,పద్మ భూషణ్ ,పద్మ విభూషణ్, పలు నంది అవార్డులు ప్రశంసలు అందుకున్న మహనీయుడనీ తెలిపారు. తెలుగు భాషకు తెలుగు పాటకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వారి గానంతో వచ్చిందని,అదొక స్వర్ణ యుగమని అన్నారు. తదుపరి బాల్ భవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో కళాకారుల కళల విలువ ఎనలేనిదని, మాటేరని చిన్నదాని కళ్ళు పలికే ఊసులు అంటూ ఊపిరి సల్పకుండ పాడే వినూత్న ప్రయోగాలు చేశాడని, నటనలో కూడా తాను తీసిపోకుండా తనదైన శైలిలో ప్రేమికుడి లో తండ్రి పాత్ర,మిధునం లో వృద్ధ దంపతులుగా, పలు పాత్రలు పోషించారు అని గుర్తు చేశారు. మువ్వలా నవ్వకలా ముద్ద మందరమా ,బలపం పట్టి భామ ఒళ్ళో అ ఆ ఇ ఈ నేర్చుకుంట, గజ్జె ఘల్లుమన్నదో గుండె జల్లు మన్నదో,, నీ కోసం నీ కోసం, ప్రియ రాగాలే గుండె లోన అంటూ ఎన్నో ప్రేమ పాటలు,జాబిల్లి కోసం ఆకాశ మల్లె వేచాను నీ రాకకై అంటూ ప్రేయసి ఎడబాటు ను బాధ తో వ్యక్త పరుస్తూ,లింగాష్టకం, శివాని భవాని,జగదానంద కారక అంటూ ఎన్నో భక్తి పాటలు మనకి పాడి వినిపించారు. పాడుతా తీయగా ప్రోగ్రాం ఏర్పాటు చేసి ఎందరో చిన్నారుల చేత పాడించారు,యువ గాయకులుగా తీర్చి దిద్దిన మహనీయుడు.ఆయన మన మధ్య తన గానంతో సజీవంగానే వుంటారని,ఆయన గురించి చెప్పాలంటే మాటలు సరిపోవని,ఆయనను ఆదర్శంగా తీసుకుని పాడాలని ఆసక్తి కలిగిన వారు బాల భవన్ ను సంప్రదిస్తే శిక్షణ అందిస్తాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బుర్రి క్రాంతి కుమార్,మౌనిక, బాల భవన్ సిబ్బంది దాసరి ఎల్లయ్య, ఉమ, సత్యనారాయణ సింగ్, అనిల్, సాయి, వీరు, పద్మ, పేరెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ కృష్ణకు సంతాపం తెలిపిన చల్లా లక్ష్మీకాంత్ బ్రదర్స్





నీలగిరి వార్త, సూర్యాపేట:-

సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు, జర్నలిస్ట్ కోండ్లే కృష్ణ మాతృమూర్తి కనకలక్ష్మి (75) వయో భారంతో పాటు అనారోగ్యం తో మంగళ వారం మరణించడం తో బుధవారం వారి సోదరి నివాసం డబుల్ బెడ్ రూమ్ కాలనీ లో జిల్లా ఆర్య వైశ్య మహాసభ కోశాధికారి చల్లా లక్ష్మీకాంత్ కనక లక్ష్మి పార్థివ దేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించి సంతాపం ఈ సందర్భంగా లక్ష్మీకాంత్ బ్రదర్స్ 3 వేల రూపాయలు ఆర్థిక సహాయం తో పాటు వారి సహకారంతో వారి మిత్రుడు గణేష్ ఎంటర్ప్రైజెస్ యజమాని లకుమారపు వరప్రసాద్ ద్వారా 2వేల రూపాయలు పాటు మొత్తం 5వేల రూపాయలు మానవతా దృకృథంతో అంత్యక్రియలకు దశదినకర్మలకు సహకారం అందజేశారు. వీరి వెంట ఆర్యవైశ్య సంఘం నాయకులు ఉపాధ్యక్షులు రాచకొండ శ్రీనివాస్, మిట్టపల్లి రమేష్ తదితరులు ఉన్నారు..


## శనంగిపల్లి శ్రీ రాజరాజేశ్వర దేవస్థానం మరో వేములవాడ కానుంది: మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ

నీలగిరి వార్త ఎల్లారెడ్డి:-



ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్ల గ్రామ శివారులో నిర్మించిన అతి పురాతనమైన శానంగిపల్లి శ్రీ రాజరాజేశ్వర ఆలయం అతి త్వరలో మరో వేములవాడగా ప్రసిద్ధి చెందుతుందని అందుకు నిదర్శనం రాష్ట్రవ్యాప్తంగా భక్తులు గత కొన్ని రోజులుగా పోటెత్తడం చూస్తుంటే వేములవాడగా రూపు దిద్దుకుంటుందని మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ తెలియజేయడం జరిగింది. కూడుములా సత్యనారాయణ ఆలయ అభివృద్ధి కొరకు 51 వేల చెక్కులు విరాళంగా ఇవ్వడం జరిగింది. సర్వత్ర అందరూ ప్రసంశించడం జరిగింది.

## వివాహ వేడుకలకు హాజరైన చల్మెడ



నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి

వేములవాడ పట్టణంలోని రేగుల దేవేందర్ సోదరుని కుమార్తె వివాహం మహారాజ ఫంక్షన్ హాల్లో జరగగా, అలాగే చక్రాల రామచంద్రం–ఎల్లవ్వల కుమారుని వివాహం పద్మావతి ఫంక్షన్ హాల్ లో జరగగా, అలాగే సింగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి వివాహం ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్లో జరగగా, అలాగే నాయకులు రామతీర్థపు హరీష్ సోదరుని వివాహం రాజశ్రీ ఫంక్షన్ హాల్లో జరగగా ఈ వివాహ వేడుకలకు లిబిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు లి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు వారి వెంట మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవిరాజు, మాజీ కౌన్సిలర్ లు నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి చందు, నాయకులు ముద్రకోల వెంకటేశం నీలం శేఖర్, కొండ కనుకయ్య, వాసాల శ్రీనివాస్, గోసుకుల రవి కేందే గంగాధర్, మంతెన సంతోష్, ఈర్లపల్లి రాజు మంతె సందీప్ సాయి పటేల్ తదితరులు ఉన్నారు.

## బాబు కిడ్నాప్ ఘటనలో మూడు గంటల్లోనే చేధించిన పోలీసులు

కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త: సుందర్:

తేదీ.04.06.2025 ఉదయం 0830 గంటలకు గురిజ కుంట గ్రామం, భిక్నూర్ మండలానికి చెందిన మక్కాల నర్సింలు అనే వ్యక్తి పట్టణ పోలీస్ స్టేషన్ కి వచ్చి, తాను మరియు తన భార్య పిల్లలతో కలిసి సిరిసిల్ల రోడ్డు లో గల ఒక్క ఫాస్ట్ ఫుడ్ సెంటర్ వద్ద రాత్రి సమయం లో పడుకున్నారని, అర్ధ రాత్రి సమయములో నిద్ర లేచి చూసేసరికి తమతో పాటుగా పడుకున్నా వారి కుమారుడు హర్షిత్, వయస్సు: 2 సం ని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినారాని ధరఖాస్తూ ఇవ్వగా, కేసు నమోదు చేయడం జరిగినది.

ఇట్టి విషయాన్ని పై అధికారులకు తెలిపి, గౌరవ జిల్లా ఎస్పి సూచనలతో, ఏఎస్పి ఆద్వర్యంలో పట్టణ సిఐ, పట్టణ ఎస్సై లు మరియు సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి, అట్టి ఏరియా లో ఉన్న సి సి కెమెరా లను పరిశీలించి చూడగా, ఒక ఆడ మరియు ఒక మగ వ్యక్తి ఇద్దరు కలిసి, బాబు ని ఎత్తుకొని వెళున్నట్లుగా గమనించి, అట్టి వారి గురించి కామారెడ్డి పట్టణములో మరియు చుట్టూ పక్కల గ్రామాలలో విచారణ చేస్తూ, బాబు ని ఎత్తుకెళ్లిన వారు దోమకొండ కి చెందిన పల్లపు రాజు మరియు పల్లపు శారాధ అని తెలుసుకొని, వారి గురించి రైల్వే స్టేషన్ కామారెడ్డి నందు వెతుకుతుండగా, వీరు ఇద్దరు ఒక్క చిన్న బాబు ని పెట్టుకొని రైల్వే స్టేషన్ లో తిరిగే వారి వద్ద భిక్షాటన చేస్తుండటం గమనించి వెంటనే వారిని అదుపులోకి తీసుకొని విచారించగా, ఆ బాబుని భిక్షాటన చేయించుట కొరకు నిన్న రాత్రి సమయములో అతడి తల్లి దండ్రులు పడుకున్న సమయములో ఎత్తికెళ్లినట్లుగా ఒప్పుకోవడం జరిగింది.

నేరస్తుల వివరాలు:

1) పల్లపు రాజు %ం/శీ% వెంకటి, వ: 34 సం, కులం: వడ్డెర, వృ: లేబర్/బిక్షాటన, ని: దోమకొండ గ్రామం మరియు మండలం.

2) పల్లపు శారాధ %ు/శీ% రాజు, వ: 30 సం, కులం: వడ్డెర, వృ: లేబర్/బిక్షాటన, ని: దోమకొండ గ్రామం మరియు మండలం.

ఇకపై ఎవరైనా కూడా మన కామారెడ్డి జిల్లాలో నేరం చేయడానికి ప్రయత్నిస్తే గాని లేదా నేరం చేస్తే గాని వారిని శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, సీసీ టీవీ ఫుటేజ్ మరియు ఇన్ఫమర్ల ద్వారా సమాచారం సేకరించి ఖచ్చితంగా నేరస్తులను వెంబడించి పట్టుకుంటామని, అదేవిధంగా నేరస్థులను కోర్టు ముందు ప్రవేశ పెట్టి కచ్చితంగా వాళ్లకు శిక్షలు పడే విధంగా చేస్తామని కామారెడ్డి ఏఎస్పి తెలియజేసినారు.ఎవరికైనా ఆపద సమయంలో కానీ, అనుమానితులు కనిపించిన సమయంలో కానీ, లేదా నేరం జరిగిన వెంటనే డయల్ 100 కు ఫోన్ చేసి సమాచారాన్ని తెలియజేయగలరు. ఇలా వెంటనే సమాచారాన్ని పోలీస్ వారికి ఇవ్వడం ద్వారా నేరస్థులను వెంటనే పట్టుకునే అవకాశం కలదు. అదేవిధంగా దొంగిలించబడిన సొత్తు కూడా బాధితులకు వెంటనే అందే అవకాశం కలదు.ఈ కేసును కేవలం 3 గంటలలో చేధించడములో చాకచక్యముగా వ్యవహరించిన కామారెడ్డి పట్టణ సి ఐ చంద్ర శేఖర్ రెడ్డి,కామారెడ్డి పట్టణ ఎస్సై శ్రీరామ్ మరియు పిసి లు విశ్వనాథ్, విజయ్, రాజు, నరేష్, రవి మరియు అశ్విని లను జిల్లా ఎస్పీ అభినందించారని తెలిపారు.



# వేదాభ్యాసకులకు ఉపయోగపడేలా వేద పాఠశాల నిర్మాణం





**భద్రకాళి ఆలయ సమీపంలో రూ. 1.3 కోట్ల వ్యయంతో వేద పాఠశాల నిర్మాణం.**

**భద్రకాళి సాంగవేద ఆగమ సంస్కృత విద్యాలయ భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్యల తో కలిసి ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ**

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

హనుమకొండ వేదాభ్యాసకులకు ఉపయోగపడేలా వేద పాఠశాలను రూ. 1.3 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినట్లు రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు.బుధవారం భద్రకాళి దేవస్థానం సమీపంలో రూ. 1.3 కోట్ల వ్యయంతో శ్రీ భద్రకాళి సాంగవేద ఆగమ సంస్కృత విద్యాలయ భవన నిర్మాణ పనులను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ల తో కలిసి రాష్ట్ర మంత్రి కొండా సురేఖ శిలాఫలకాన్ని ఆవిష్కరించి శంకుస్థాపన చేసి నిర్మాణ పనులను ప్రారంభిచారు. అదేవిధంగా భద్రకాళి ఆలయం ముందు రాజగోపుర నిర్మాణ పనుల శిలాఫలకాన్ని మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు.

భద్రకాళి దేవస్థాన ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు, ఇతర వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వేద పాఠశాల భవన నిర్మాణ పనులకు పూజా కార్యక్రమాల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ వేద పాఠశాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేసినట్లు పేర్కొన్నారు. వేదం అనేది లేకపోతే దేవాలయాల్లో పూజలు అనేటివి జరగవననే విషయం మనకు తెలుసునని, అందుకు వేదాలను పెంచి పోషించాల్సిన బాధ్యత దేవాదాయ శాఖకు ఉందని అన్నారు. ఆలయాలకు వేద పండితులను అందించేందుకు వేద పాఠశాల ఉపయోగపడుతుందని అన్నారు. ఏ ఊరిలో ఏ గుడి ఉందో వెబ్సైట్ ద్వారా తెలుసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా దాతలు గుడులకు దానం చేయడానికి అవకాశం కలుగుతుందన్నారు. దేవాదాయ శాఖకు అందించినప్పుడు అవసరాన్ని బట్టి ఆలయాల అభివృద్ధికి తీసుకోవడం జరుగుతుందన్నారు. కొందరు దాతలకు తమ సొంత ఊరులోని ఆలయాలను అభివృద్ధి చేసేందుకు దాతలుగా ముందుకు వస్తారని, అలాంటి వారికి ఉపయోగపడే విధంగా వెబ్ సైట్ ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. గత కొన్నేళ్లుగా మూలకు పడి ఉన్న దేవాదాయ శాఖ దస్త్రాలను బయటకు తీస్తున్నట్లు పేర్కొన్నారు. కొన్నేళ్లుగా ఆగిపోయిన అర్చకుల పదోన్నతులను కల్పించినట్లు తెలిపారు. దేవాదాయ శాఖలో సిబ్బంది కొరత ఉందని, సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాల్సిన బాధ్యత తమ శాఖకు ఉందన్నారు. త్వరలోనే సిబ్బంది కొరతనుతగ్గిస్తామన్నారు . ఎన్నడూ లేని విధంగా మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను బ్రహ్మాండంగా నిర్వహించామని పేర్కొన్నారు. గతేడాది బోనాల జాతరను కూడా వైభవంగా నిర్వహించామని తెలిపారు. ఈసారి కూడా బోనాల జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు ఆరో తేదీన సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సరస్వతి పుష్కరాలను అద్భుతంగా నిర్వహించారని భక్తుల ద్వారా అభినందనలు అందాయని పేర్కొన్నారు. ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నట్లు తెలిపారు. దేవాదాయ శాఖ భూములు ఆక్రమించిన వారు స్వచ్ఛందంగా భూములు తిరిగి ఇవ్వాలని లేకపోతే చట్ట ప్రకారం ముందుకెళ్తామన్నారు. చట్ట ప్రకారం దేవాదాయ భూములను వెనక్కి తీసుకుంటామన్నారు. కోట్లాది రూపాయల విలువైన దేవాదాయ శాఖ భూములను అక్రమంగా ఆక్రమించడం చట్ట విరుద్ధమన్నారు. వేద పాఠశాల నిర్మాణానికి అనువైన స్థలం గుర్తించి , నిర్మాణానికి నిధులను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. వీలైనంత త్వరగా పేద పాఠశాల భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. భద్రకాళి మాఢ వీధుల నిర్మాణ పనులకు దాదాపు రూ.30 కోట్లను మంజూరు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా భద్రకాళి చెరువు కూడా పూడిక మట్టితో నిండి ఉందని, తద్వారా నీటి నిల్వ సామర్థ్యం తక్కువైన సందర్భంలో పూడికతీత అనేది సాహసోపేతమైన నిర్ణయమని అన్నారు. భద్రకాళి చెరువులోని నీటిని ఖాళీ చేయించి పూడిక మట్టిని బయటకు తీయించి నీటి నిల్వ సామర్థ్యం పెంచేందుకు ప్రభుత్వం పూడికతీత కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. చెరువు పూడికతీత పనులు విజయవంతంగా సాగుతున్నాయన్నారు. రాబోయే రోజుల్లో వర్షాలు పడ్డప్పుడు గతంలో ఉన్న నీటి నిల్వ సామర్థ్యం కంటే రెట్టింపు నీటి నిల్వ సామర్థ్యం ఉండబోతుందన్నారు. రాబోయే రోజుల్లో వరంగల్లోని అన్ని ఆలయాలను ప్రత్యేక దృష్టితో చూస్తామని, ఆర్కియాలజీ పరిధిలో ఉన్న ఆలయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఫోర్ట్, వరంగల్ లో వెతికితే 14 ఆలయాలు బయటకు వచ్చాయని అన్నారు. ఆలయాలు చెక్కుచెదరకుండా ఉన్నాయని, ఆలయాల్లోపల విగ్రహాలు లేవని పేర్కొన్నారు. సమస్య ఎక్కడ వస్తుందంటే ఆర్కియాలజీ వాళ్లను అడిగినప్పుడు ఉన్నదున్నట్లు ఉంచి పూజలు చేసుకోవాలని, ఏ పని చేయడానికి వీలులేదని వారు చెబుతున్నారని అన్నారు. ఆర్కియాలజీ పర్మిషన్కు రాయనున్నట్లు తెలిపారు. ఆలయాలకు సంబంధించి చరిత్ర ఉందని, ఆ చరిత్ర ప్రకారం ఆ దేవుళ్లను ప్రతిష్టించి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఫోర్ట్ వరంగల్ కు చాలామంది సందర్శకులు వస్తుంటారని, ఆలయాల పునరుద్ధరణతో టూరిజం స్పాట్ గా డెవలప్ అవుతుందన్నారు. దీంతో రేవెన్యూ అభివృద్ధి చెందుతుందన్నారు. అన్ని దేవాలయాలను పరిశీలించాలని, సరైన మాస్టర్ ప్లాన్ ను రూపొందించాలని సలహాదారు గోవిందు హరి కి సూచించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో వరంగల్ లోని దేవాలయాలను మరింత అభివృద్ధి చేసి ఎక్కువమంది భక్తులు సందర్శించుకునే విధంగా మంచి మార్గాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. వరంగల్ నగరం చారిత్రాత్మక నగరం అని, కాకతీయులు ఏలిన ఈ నగరానికి తిరిగి ఆ వన్నెను తీసుకురావడానికి పాలకులుగా తమపై బాధ్యత ఉందన్నారు. వేద పాఠశాల లేక వేదభ్యాసకులు ఎన్ని ఇబ్బందులు పడ్డారో తనకు తెలుసునని, భవన నిర్మాణం పూర్తయితే ఆ ఇబ్బందులు తీరుతాయన్నారు. వేద పండితులు దేవాదాయ శాఖకు ఎంతో అవసరమని, వేదాభ్యాసకులు వేద పఠనం విజయవంతంగా పూర్తి చేసుకోవాలన్నారు. వేదాభ్యాసకులు రానున్న రోజుల్లో మంచి వేద పండితులుగా పేరు తెచ్చుకోవాలన్నారు. భద్రకాళి దేవస్థానం అభివృద్ధికి భవిష్యత్తులోనూ కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణి అసిస్టెంట్ కమిషనర్ శేషు భారతి , కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి, ట్రస్టీ, ప్రముఖ వైద్యులు డాక్టర్ శివ సుబ్రహ్మణ్యం, వేద పండితులు, తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ షాప్ తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

రేషన్ షాపుల ద్వారా సకాలంలో వినియోగదారులకు రేషన్ బియ్యం ఇతర వస్తువులు పంపిణీ చేయాలని ఎప్పటికప్పుడు సంబంధిత రికార్డులను నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. బుధవారం వరంగల్ మండలంలోని ఏనుమాముల భూభారతి గ్రామసభలో పాల్గొని తిరిగి వెళుతున్న క్రమంలో వరంగల్ మండలంలోని బాలాజీ నగర్ లో చౌక ధరల దుకాణం వద్ద ఎక్కువ మంది గుమ్మిగూడి ఉనట్లు గమనించిన కలెక్టర్ వెంటనే తన వాహనాన్ని ఆపి బాలాజీనగర్ రేషన్ షాప్ ను తనిఖీ చేశారు. ఎండాకాలం దృష్ట్యా వినియోగదారులకు ఇబ్బందులు కలుగకుండా వారి సౌకర్యార్థం ప్రతిరోజు 15 చొప్పున టోకెన్లు ముందుగానే అందజేసి క్రమ పద్ధతిలో బియ్యం, ఇతర వస్తువులు పంపిణీ చేయాలని డీలర్ ను కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం 3 నెలల బియ్యం ఒకేసారి అందిస్తున్న నేపథ్యంలో బయోమెట్రిక్ ద్వారానే రేషన్ పంపిణీ జరగాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వినియోగదారులతో నేరుగా మాట్లాడుతూ రేషన్ సక్రమంగా అందుతున్నదా అని అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్న బియ్యం నాణ్యతను పరిశీలించారు. పేదవారికి కూడా సన్న బియ్యం పంపిణీ చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం సన్న బియ్యం కార్యక్రమం పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నదని, పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తప్పవని రేషన్ డీలర్ ను హెచ్చరించారు. షాప్ కు సంబంధించిన స్టాక్ వివరాలు బోర్డులు, ఫ్లెక్సీల ద్వారా ప్రజలకు కనిపించే విధంగా ప్రదర్శించాలని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు.

## కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పేదవాడి సొంతింటి కల నెరవేరుతుంది

**పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి.**



పరకాల నీలగిరి వార్త.

బుధవారం ఆత్మకూరు మండల కేంద్రం, పెంచికలపేట గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని అన్నారు.ప్రభుత్వ నిబంధన మేరకు సూచించిన విధంగా వివిధ దశలకు ఇంటి నిర్మాణం బిల్లులను చెల్లించడం జరుగుతుందని, ఉచిత ఇసుకను పంపిణీ చేస్తామని అన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఎవరికి ఒక్క రూపాయి ఇవ్వద్దని, ఎవరైనా తీసుకుంటే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాలు లేవని, పదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు మహిళా సంఘాల ద్వారా రుణాలు తీసుకోవచ్చని అన్నారు. నియోజకవర్గంలోని అర్హులైన లబ్ధిదారులకు ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేస్తామని అన్నారు.ఆత్మకూరు మండలం పెంచికలపేట గ్రామపంచాయతీ పరిధిలో హెల్త్ సబ్ సెంటర్ భవనాన్ని మంజూరు చేయాలని కోరుతూ ఏ ఎన్ ఎంలు, ఆశ వర్కర్లు వినతి పత్రాన్ని అందజేశారు.

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

బుధవారం బుల్లికుంట్ల గ్రామం, ఖిలా వరంగల్ మండలం రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్ %ఎణ=%, డాలర్. ఉమారెడ్డి, వ్యవసాయ కళాశాల, %ూాణ%, డా. ఎ. వెంకట్ రెడ్డి వ్యవసాయ శాఖతో కలసి "రైలు ముంగిట్లో శాస్త్రవేత్తలు" అనే కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా డా ఎమ్. యూది, విస్తరణ సంచాలకులు హాజరు అయి కొన్ని విషయాలను రైతులకు వివరించడం జరిగింది.ముఖ్యంగా రైతులు మట్టి పరీక్ష చేయించుకొని దానికి తగ్గట్టుగా రసాయన ఎరువులను వాడుకోవాలని పురుగు మందులను సిఫారసు మేరకే వాడాలవి, వీటికి వృధా చేయకుండా పంటకు అవసరమైనప్పుడే నీటికి అందిచాలని కలుపు యాజమాన్యం సరైన సమయంలో చెపట్టాలని రైలులు విత్తనాలను కొనుగోలు చేసిన తరువాత రసీదులను జాగ్రత్తగా భద్రపరచాలని వివరించడం జరిగింది అంతే కాకుండా పంట వైవిధ్యం దాని ఉపయోగాల గురించి వివరించారు.పప్పు దినుసుల పంటలను ప్రభుత్వం చాలా వరకు దిగుమతులు చేనుకుంటుంది. కాబట్టి మనమే ఈ పంటల యొక్క విస్తీర్ణం పెంచుకోవాలని ఆద్వారా పంట మార్పిడి కూడా జరిగి భూమి సారవంతం అవుతుందని వివరించడం జరిగింది.

డా. ఆర్. ఉమారెడ్డి అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ . మాట్లాడుతూ యూరియా వినియోగం తగ్గించుకోవాలని, పంటకు తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు వెయ్యాలని, రసాయన మందులను అవసరం మేరకే వినియోగించాలని వివరించడం %ఖూ=ాదీ.%డా. ఎ. వెంకట్ రెడ్డి, మాట్లాడుతూ నీటి వనరులను అనోసిమీట్ డిన కాపాడుకోవాలని, చెట్లును బాగా పెంచాలని, లేదంటే రాబోయే కాలంలో జరిగే విపత్తుల గురించి వివరించడం జరిగింది. వ్యవసాయ పరిశోధన స్థానంలో లభించే వరి, కంది రకాల వినరాలను కూడా రైతులకు ఈ కార్యక్రమంలో తెలపడం 2008.మండల వ్యవసాయ అధికారి, ఎన్. రవిందర్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ పథకాల గరించి జిలుగ విత్తనాల లభ్యత నేరుగా వరిని వెదజల్లే పద్ధతి గురించి వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డి. అశ్వని, కె మానస్తా వ్యవసాయ కళాశాల విద్యార్థులు నందిని, నేహ, అంజలి, మేహరునినా మండల విస్తరణ అధికారి ఎన్. సత్య ప్రకాష్, పిఎసిఎస్ చైర్మన్ కెడల జనార్ధన్, వైస్ చైర్మన్ భూమాత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నాగయ్య పల్లెలో రెచ్చిపోయిన భూకబ్జాదారులు



**ఎస్సీల స్మశానవాటిక కబ్జా చేసిన వైనం!**

**భూకబ్జాదారులను కఠినంగా శిక్షించాలి!**

**ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ డిమాండ్!**

హనుమకొండ నీలగిరి వార్త.

మండలంలోని నాగయ్య పల్లెలో కొంతమంది అగ్రకుల రెడ్డి కులస్తులు భూకబ్జాదారులుగా అవతారమెత్తి రెచ్చిపోయారు. ఏకంగా ఎస్సీల స్మశాన వాటికనే కబ్జా చేశారు.సర్వే నెంబర్ 931లో దాదాపు రెండు ఎకరాల భూమిలో ఆది నుంచి గ్రామంలోని మాదిగ కులస్తులు స్మశాన వాటికగా ఏర్పాటు చేసుకొని సమాధులు నిర్మించారు.ఈ భూమిపై కన్నేసిన గ్రామానికి చెందిన పోగుల మహేందర్ రెడ్డి,పోగుల బ్రహ్మయ్య,పోగుల కైలాసం,పోగుల సురేందర్ అను వ్యక్తులు మంగళవారం గుర్తుతెలియని రెండు జెసిబిలను తీసుకువచ్చి సమాధులను తొలగించి స్మశానవాటికలోకి అక్రమంగా ప్రవేశించి భూమిని చదును చేశారు.దీనిపై పోలీసు అధికారులకు,రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ ఆధ్వర్యంలో గ్రామస్తులు బుధవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాతో సుమారు రెండు కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ స్తంభించింది.ఈ సందర్భంగా ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ మాట్లాడుతూ కఠిన చర్యలు తీసుకొని ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.ఎస్సై తిరుపతి సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకాలను శాంతింపజేసి కబ్జాదాలపై చర్య తీసుకుంటామని హామీ ఇచ్చి ధర్నాను విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ దళిత ప్రజాసంఘాల నాయకులు బాగాజీ రజనీకాంత్,జినుక అశోక్,మాదాసి ప్రభాకర్, మాదాసి ఎర్ర సూరయ్య,మాదాసి కృష్ణ, మాదాసి సాంబయ్య, మాదాసి సుధాకర్,సంగి యాకయ్య,గిన్నారపు భాస్కర్, మాదాసిరాజు,మాదాసి మల్లయ్య,మాదాసి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉర్సు ఎల్లమ్మ తల్లి ఆలయం అభివృద్ధికి సహకారం

**కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు.**



వరంగల్ సిటీ నీలగిరి వార్త.

మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావుఉర్సు కరీమాబాద్ గౌడ కులస్తులకు అన్ని విధలా అండగా ఉంటానని, శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయం పునర్నిర్మాణం పనులకు తగిన సహకారం అందిస్తానని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు తెలిపారు. బుధవారం ఉర్సు తాళ్ల మండువాలోని వేడుకల మందిరంలో ఉర్సు, కరీమాబాద్ గౌడ కులస్తులకు చెందిన 80 గజాల రిజిస్ట్రేషన్ దస్తావేజులను కొండా మురళి పంపిణీ చేశారు. ఎల్లమ్మ ఆలయం పునర్నిర్మాణం పనులకు దేవాదాయశాఖ ద్వారా నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు రూ.50 లక్షలు మంజూరు చేస్తామనన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ కు గౌడ కులస్తులు అండగా ఉండాలని, కాంగ్రెస్ ను గెలిపించాలని కోరారు. గౌడ కులస్తులకు అన్ని వేళలలో అండగా ఉంటానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు గోపాల నవీన్ రాజ్, మీసాల ప్రకాష్, మాజీ కార్పొరేటర్లు బత్తిని వసుంధర, నాగపూరి కల్పన, శోభ, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, గౌడ సంఘం పెద్దలు బత్తినిఅఖిల్, శ్యామ్, మదూరి సుధాకర్, మండా వెంకన్న, బత్తిని హరి, సతీష్, నాగపూరి సంజయ్ బాబు, కుమారస్వామి, బుజ్జి బాబు ,గడ్డం యుగేందర్ పాల్గొన్నారు.

## శ్రీ ఆది మహాలక్ష్మి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నవగ్రహాల శంకుస్థాపన





వరంగల్ సిటీ నీలగిరి వార్త.

టీచర్స్ కాలనీ గణేష్ నగర్, నందు కొలువై ఉన్న ఆది మహాలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వర స్వామి, భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి, సువర్చల సమేత ఆంజనేయ స్వామి ఆలయములు ఒకే ప్రాంగణంలో కొలువై ఉండి భక్తుల పాలిట కొంగుబంగారమై అందరికీ దివ్యానుభూతిని ప్రసాదించి దినదిన ప్రవర్ధమానమగుచున్నది ఆలయం నందు ఈశాన్యమున నవగ్రహ మండపం సర్వాంగ సుందరంగా నిర్మించబడి నవగ్రహ దేవతా ప్రతిష్ట స్వస్తిశ్రీ విశ్వాస నామ సంవత్సర జేష్ట శుద్ధ నవమి బుధవారము అనగా నేడు త్రాగ్నిక దీక్షతో వైదిక యోగ ముక్తముగా ఆగమ సామ్రాట్ స్వర్ణ కంకణ సన్మానితులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో స్మార్త విశారద గుమ్మడవెల్లి గణేష్ ఆత్రేయ శర్మ ఆచార్యత్వంలో నవగ్రహాల ప్రతిష్ట ప్రారంభము వేద ఘోషలతో, నామ సంకీర్తనలతో నిర్వహించబడుతున్నది. ఈ కార్యక్రమానికి అధిక మొత్తంలో ఆర్థికంగా చేయూతనిచ్చిన వారు అయిత రాజయ్య , జెకె శర్మ, బజ్జూరి కావ్య అమర్నాథ్, జూలూరి రవికుమార్ వినయ్ కుమార్,, గజ్జి భాస్కర్ మరియు ఓడపల్లి విజయ్ కుమార్ లు దాదాపు 90 మంది భక్తులు పదివేల 116 రూపాయలు చొప్పున ఆర్థిక సహకారాన్ని అందించారు ప్రారంభ కార్యక్రమంలో గణపతి పూజ స్వస్తి పుణ్యాహవాచనం మాతృకా పూజ నాంది వృత్తి వరణం మధుపర్కనిది వర్ధిని పూజ యాగశాల ప్రవేశం తో పాటుగా అగ్నిప్రతిక్ష, సర్వతో భద్ర , వాస్తు యోగిని నవగ్రహ క్షేత్రపాల మండల దేవత యజనము, బలి ప్రదానములు, మూలమంత్రాను హవనములు ఆచార్యులు రవికుమార్ ఆచార్యులు వెంకట శర్మ, ముఖేష్ తివారి, శివశర్మ వెంకన్న శర్మ, సాయి ప్రణీత్ శర్మ, హరిప్రసాద్ ,రామానుజ శర్మ, వివేక్ శర్మ , సాకేత్ శర్మ వేదమంత్ర ఉత్సరణతో కార్యక్రమం అధ్యాంతము అంగరంగ వైభవముగా నిర్వహించనున్నది సాయంత్రము 6 గంటలకు జలాధివాసము సాయంతన పూజ నీరాజనం మంత్రపుష్పములు నిర్వహించుటకు ఆలయ కమిటీ నిర్ణయించనైనది గురువారం రోజున గణపతి పూజ స్నాపన విధి ప్రధమ వీధితో పాటుగా 20 హోమ గుండములతో 80 మంది దంపతులకు హోమం నందు అవకాశం కల్పించినది. వేద ఘోషలతో ఆగమోక్త క్రియ కళాపములతో నామ సంకీర్తనలతో నిర్వహించబడును ఇట్టి ప్రతిష్ట కార్యక్రమమునకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదములు గ్రహించి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ కమిటీ తెలియజేయడమైనది.

